గురువారం
01-08-2024
విజయవాడ ప్రచురణ
సంపుటి : 73, సంచిక : 41
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952

విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

పెరుతో వెనిజులా 'దౌత్య' కటీఫ్

కారకస్: పెరుతో దౌత్య సంబంధాలు తెంచుకోవాలని వెనిజులా ప్రభుత్వం నిర్ణయించుకున్నట్లు విదేశీ వ్యవహారాల మంత్రి య్వాన్ గిల్ ప్రకటించారు. 1961 నాటి దౌత్య సంబంధాల వియన్నా సదస్సు అధికరణ 45 ఆధారంగా రిపబ్లిక్ ఆఫ్ పెరూతో దౌత్యపరంగా తెగతెంపులు చేసుకోవాలని బొలీవియన్ రిపబ్లిక్ ఆఫ్ వెనిజులా ప్రభుత్వం నిర్ణయించిందని గిల్ 'ఎక్స్'లో పేర్కొన్నారు. పెరూ విదేశాంగ మంత్రి జేవియర్ గాంజాల్వెజ్ ఒలాఛియా కూడా స్పందిస్తూ 'వెనిజులా ప్రజల అభిలాషను అతిక్రమించడాన్ని పెరూ అంగీకరించదు' అని వెనిజులా అధ్యక్ష ఎన్నికలనుద్దేశించి వ్యాఖ్యానించారు. దీంతో ఆ దేశానికి కటీఫ్ చెప్పేయాలని వెనిజులా నిర్ణయించుకున్నది.

యూపీఎస్సీ చైర్మన్‌గా ప్రీతి సుదాన్ నియామకం

న్యూఢిల్లీ: యూనియన్ పబ్లిక్ సర్వీస్(యూపీఎస్సీ) కమిషన్ నూతన చైర్మన్‌గా ప్రీతి సుదాన్ నియమితులయ్యారు. 2025 ఏప్రిల్ 29వ తేదీ వరకు లేకుంటే... తదుపరి ఆదేశాలు వెలువడే వరకు ఆమె ఈ పదవిలో కొనసాగనున్నారు. ప్రస్తుతం యూపీఎస్సీ సభ్యురాలిగా ఆమె కొనసాగుతున్నారు. ఆగస్ట్ 1వ తేదీన ఆమె యూపీఎస్సీ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టనున్నారు. ఇప్పటి వరకు యూపీఎస్సీ చైర్మన్‌గా ఉన్న మనోజ్ సోని రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. దీంతో కొత్త యూపీఎస్సీ చైర్మన్ నియామకం అనివార్యమైంది. ఇటీవల వరకు యూపీఎస్సీ చైర్మన్‌గా

- మిగతా 2 లో

పూజా ఖేడ్కర్ ఐఏఎస్ అభ్యర్థిత్వం రద్దు

న్యూఢిల్లీ: మహారాష్ట్రకు చెందిన వివాదాస్పద ప్రొబేషనరీ ఐఏఎస్ అధికారిణి పూజా ఖేడ్కర్ ప్రొవిజినల్ అభ్యర్థిత్వాన్ని యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ రద్దు చేసింది. భవిష్యత్తులో మళ్లీ నియామక పరీక్షలు రాయకుండా డిబార్ చేసినట్టు అధికారులు బుధవారం వెల్లడించారు. పూణెలో ట్రైనీ సహాయ కలెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్న సమయంలో పూజా ఖేడ్కర్‌పై అధికార దుర్వినియోగంతో

- మిగతా 2 లో

మోదీపై సభా హక్కుల ఉల్లంఘన తీర్మానం

స్పీకర్ ఓంబిర్లాకు కాంగ్రెస్ నోటీసు

న్యూఢిల్లీ: లోక్‌సభ వేదికగా బీజేపీ ఎంపీ అనురాగ్ ఠాకూర్ చేసిన 'కులం' వ్యాఖ్యలపై ప్రతిపక్షాలు భగ్గుమంటు న్నాయి. కులగణన చేయాలన్న రాహుల్ గాంధీ డిమాండ్‌ని ఉద్దేశించి ఆయన ఈ వ్యాఖ్యలు చేయడంపై కాంగ్రెస్‌తో పాటు దాని మిత్ర పక్షాలు బీజేపీని విమర్శిస్తున్నాయి. కాగా ఈ వ్యాఖ్యలు చేసిన అనురాగ్ ఠాకూర్‌కి ప్రధాని నరేంద్రమోదీ మద్దతుగా

- మిగతా 2 లో

భూ దోపిడీపై విచారణ

- ప్రత్యేక హోదాతోనే మేలు
- విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ సరికాదు
- ప్రజా ఉద్యమాలపై కేసులు ఎత్తివేయాలి
- సీఎం చంద్రబాబుకు సీపీఐ నేతల విజ్ఞప్తి

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి: గత ప్రభుత్వ హయాంలో జరిగిన భారీ భూ కుంభకోణాలపై సమగ్ర విచారణ చేయించాలని సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లినట్లు సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ తెలిపారు. అన్నమయ్యజిల్లా మదనపల్లె సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఫైళ్ల దహనం ఘటనలో తాము గుర్తించిన అంశాలతోపాటు వివిధ సంఘటనలను చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు. కబ్జాకు గురైన భూములను తిరిగి హక్కుదారులకు అప్పగించేలా చర్యలు తీసుకోవాలని కోరామన్నారు. బుధవారం వెలగపూడి సచివాలయంలో చంద్రబాబును నారాయణతోపాటు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, సహాయ కార్యదర్శులు ముప్పాళ్ల నాగేశ్వరరావు, జేవీఎస్ఎన్ మూర్తి, కార్యదర్శివర్గ సభ్యులు జల్లి విల్సన్ (మాజీ ఎమ్మెల్సీ), అక్కినేని వనజ, ఓబులేసు కలిసి వివిధ సమస్యలపై వినతిపత్రం అందజేశారు. అమరావతి, పోలవరం నిర్మాణం, విద్యుత్, ఆర్టీసీ చార్జీల భారాలు, విభజన హామీల అమలు, విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాడినందుకు సీపీఐ, అనుబంధ సంఘాల నేతలపై గత ప్రభుత్వం బనాయించిన కేసులు ఎత్తివేయాలని విజ్ఞప్తి చేశారు. పోలవరం ప్రాజెక్టు సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలని, నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. పోలవరాన్ని మొదటి దశ వరకే పరిమితం చేయాలనే నిర్ణయాన్ని గత ప్రభుత్వం సమర్థించడం విచారకరమని, 45.72 మీటర్ల ఎత్తులోనే నిర్మాణం జరగాలని కోరారు. ఎన్నో త్యాగాల ఫలితంగా ఏర్పడిన విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటుపరం కాకుండా చూడాలని కోరారు. సీఎంను కలిసిన అనంతరం పార్టీ నేతలతో కలసి నారాయణ మీడియాతో మాట్లాడారు. వివిధ ప్రజాఉద్యమాల్లో గత ప్రభుత్వం నమోదు చేసిన కేసులు ఎత్తేయాలని చంద్రబాబును కోరినట్లు చెప్పారు. ఎన్నికల ఫలితాలు వచ్చే ముందు ఫైళ్లు తగలబెట్టడం పరిపాటిగా మారిందన్నారు. ఇటీవల మదనపల్లెలో తాము పర్యటించామని, ఆ చుట్టుపక్కల జిల్లా మొత్తం భూమిని దోచేశారని గుర్తించామన్నారు. 22ఏలో పెట్టి ఫ్రీ హోల్డ్ చేసి రిజిస్ట్రేషన్ చేసేశారన్నారు. మదనపల్లె ఫైళ్లు మొత్తం తగలబడలేదని, ఎంపిక చేసినవే తగలబడ్డాయని చెప్పారు. గత ప్రభుత్వంలో వేధింపులు ఎన్నో జరిగాయని, ప్రభుత్వమే వాటిని సమీక్షించాలని, ప్రజలు కూడా ముందుకు రావాల్సిన అవసరముందన్నారు. మదనపల్లెలో ఒక ప్రాంతంలో మాత్రమే అగ్నిప్రమాదం జరిగిందని, ఈ సంఘటనపై ఆగస్టు 4వ తేదీన మదనపల్లెలో బాధితులతో సమావేశం ఏర్పాటు చేస్తామన్నారు. అనంతరం విజయవాడలోను, మిగిలిన జిల్లాల్లోను భూములు కోల్పోయిన బాధితులతో సమావేశాలు నిర్వహిస్తామని చెప్పారు. కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటికీ... పాత కాంట్రాక్టర్లే పనిచేస్తున్నారని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా భూ లావాదేవీలకు సంబంధించిన అక్రమ కేసుల విషయంలో ప్రజల్ని సమీకరిస్తామన్నారు. ప్రభుత్వం మారినా కిందిస్థాయిలో అధికారులు మారడం లేదని చెప్పారు. కేంద్రంలోని ఎన్డీఏ కూటమి ప్రభుత్వానికి చంద్రబాబు, నితీశ్‌కుమార్ మద్దతు లేకుంటే... మోదీ పని అయిపోయినట్లేనన్నారు. రాష్ట్రానికి కేంద్రమంత్రి పదవులు దక్కడం వల్ల ఉపయోగం ఏమిటని, అందులో సత్తా గల శాఖలు లేవన్నారు. ఏపీకి బడ్జెట్లో ఏ మొచ్చిందని, కేటాయింపులు సరిగ్గా లేవని చెప్పారు. ఏపీకి ప్రత్యేక హోదా అమలు చేస్తేనే అన్ని విధాలా ఫలితం ఉంటుందని పునరుద్ఘాటించారు. ప్రత్యేక హోదా రాజ్యాంగ పరమైన హక్కు అని, దాన్ని కాదని 15 వేల కోట్ల రూపాయలు అప్పుగా ఇస్తామన్నారని, రాష్ట్రానికి పచ్చళ్లు, కూరలు వేసి అన్నం పెట్టలేదని నారాయణ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. ప్రత్యేక హోదా వస్తే మన హక్కులకు రక్షణ ఉంటుందని నొక్కిచెప్పారు. ప్రపంచ బ్యాంక్ రుణం వివాదంగా

- మిగతా 2 లో

వంద రోజులు...
ఐదు కొత్త పాలసీలు

- నాలుగు ప్రాంతాల్లో కొత్త పారిశ్రామిక క్లస్టర్లు
- ప్రోత్సాహకాలపై సానుకూల నిర్ణయం
- వెనక్కి వెళ్లిన పారిశ్రామికవేత్తలతో సంప్రదింపులు: సీఎం చంద్రబాబు

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి: రాబోయే 100 రోజుల్లో కొత్తగా ఐదు నూతన పాలసీలు తీసుకురావాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు. నూతన పారిశ్రామిక విధానం, ఎంఎస్ఎంఈ విధానం, ఆహారశుద్ధి విధానం, ఎలక్ట్రానిక్, ఐటీ–క్లౌడ్ పాలసీ, టెక్స్‌టైల్ పాలసీ తీసుకురావాలని, అత్యుత్తమ పాలసీల ద్వారా పెట్టుబడుల ఆకర్షణకు అనువైన వాతావరణం కల్పించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటు, తీసుకురావాల్సిన కొత్త పాలసీలపై బుధవారం వెలగపూడి సచివాలయంలో అధికారులతో సీఎం చంద్రబాబు సమీక్షించారు. రాష్ట్రాన్ని గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్‌ఎనర్జీ హబ్‌గా చేయాలనే లక్ష్యంతో విధానాలు రూపొందించాలని చంద్రబాబు సూచించారు. కొత్తగా నాలుగు పారిశ్రామిక క్లస్టర్లపై ప్రతిపాదనలు సిద్ధం చేసి కేంద్రం అనుమతులు పొందాలన్నారు. కుప్పం, మూలపేట, చిలమత్తూరు, దొనకొండ లేదా పామూరులో కొత్త క్లస్టర్లు ఏర్పాటు చేయాలని, ఈ మేరకు ప్రక్రియ ప్రారంభించాలని ఆదేశించారు. ఆయా క్లస్టర్లలో ఎలక్ట్రానిక్స్, ఫార్మా, ఫుడ్ ప్రాసెసింగ్, హార్డ్‌వేర్ సంస్థల ఏర్పాటుకు కృషి చేయాలన్నారు. కృష్ణపట్నం, నక్కపల్లి, ఓర్వకల్లు, కొప్పర్తి నోడ్స్ ప్రగతిపై అధికారులతో చర్చించారు. నక్కపల్లిలో రూ.11,542 కోట్లతో ఏర్పాటు చేసే బల్క్‌డ్రగ్ పార్క్, రూ.60 వేల కోట్లతో ఏర్పాటయ్యే ఎన్టీపీసీ గ్రీన్ హైడ్రోజన్ హబ్, ప్రస్తుతం చర్చలు జరుపుతున్న బీపీసీఎల్ ప్రాజెక్టుల స్థితిగతులపై అధికారులతో సమీక్షించారు. పదేళ్లలో పెట్టుబడుల కోసం వివిధ సందర్భాల్లో చేసుకున్న ఒప్పందాలు, వాటి పరిస్థితిపై అధికారులతో సీఎం చర్చించారు. టీడీపీ గతంలో అధికారంలో ఉన్న సమయంలో రూ.16 లక్షల కోట్ల పెట్టుబడులపై ఒప్పందాలు చేసుకోగా... తర్వాత వచ్చిన ప్రభుత్వం అనుసరించిన

- మిగతా 2 లో

మార్పు అనివార్యం

- అప్పుడే మీడియా సంస్థల మనుగడ సాధ్యం
- ఉద్యోగులు, సిబ్బంది నిబద్ధత అనిర్వచనీయం
- తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి
- వైభవంగా విశాలాంధ్ర ఎంప్లాయీస్ యూనియన్ వజ్రోత్సవం

విశాలాంధ్ర–విజయవాడ: తాము పనిచేస్తున్న సంస్థను కాపాడుకోవటానికి ఎలాంటి త్యాగానికైనా సిద్ధపడటం...పని పట్ల నిబద్ధత కలిగి ఉండటం విశాలాంధ్ర ఉద్యోగుల సొత్తు అని తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి కొనియాడారు. విశాలాంధ్ర ఎంప్లాయీస్ యూనియన్ ఏర్పడి 60 ఏళ్లు పూర్తైన సందర్భంగా విశాలాంధ్ర కార్యాలయం చంద్రం బిల్డింగ్‌లో బుధవారం యూనియన్ వజ్రోత్సవం వైభవంగా జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ (ఐజేయూ) అధ్యక్షుడు, తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ విశాలాంధ్ర సహకార సంస్థ విధానంలో ఏర్పడిందని, దీనికి లాభాలు వచ్చినా... నష్టాలు వచ్చినా పాలుపంచుకునేది ఉద్యోగులేనన్నారు. సమాజంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా మారితేనే ఏ సంస్థ అయినా మనుగడ సాగిస్తుందని చెప్పారు. ప్రకటనలు ఎవరు ఇచ్చినా తీసుకోవచ్చని, ఆ ప్రకటనల్లో తప్పులు ఉంటే వార్తగా రాసే అవకాశం ఉందన్నారు. శక్తి కొలది ఇతర పత్రికలతో పోటీ పడాలన్నారు. ఏ చిన్న లాభం వచ్చినా... అది సంస్థ ఉద్యోగులకు, సంస్థ ఆధునీకరణ, విస్తరణకు వినియోగించాలని సూచించారు. విశాలాంధ్ర విజ్ఞాన సమితి

- మిగతా 2 లో

కేబినెట్ వాయిదా

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి: ఆంధ్రప్రదేశ్ మంత్రివర్గ సమావేశాన్ని ఆగస్టు 7వ తేదీకి వాయిదా వేశారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ బుధవారం ఉత్తర్వులు జారీజేశారు. 7వ తేదీ ఉదయం 11 గంటలకు సమావేశాన్ని నిర్వహిస్తారు. ఆగస్టు 2న కేబినెట్ జరగాల్సి ఉండగా దానిని 7వ తేదీకి వాయిదా వేసినట్లు ఉత్వర్వుల్లో పేర్కొన్నారు.

ఇజ్రాయిల్ ప్రతీకార దాడిలో
హమాస్ అగ్రనేత హతం

2లో

ఇదీ లోకం!

అయ్యో... అయ్యో.. మరి మిమ్మల్ని ఎవరు గెలిపించమన్నారు?

సాగు భారం

- కష్టాల్లో కౌలు రైతులు
- గత ప్రభుత్వ విధానాలతో నష్టం
- ఖరీఫ్ గుర్తింపు కార్డుల జారీలో జాప్యం
- అందని రబీ ధాన్యం సొమ్ము
- ఏలూరు, బాపట్ల, కోనసీమ జిల్లాల్లో పెండింగ్

ఖరీఫ్ ప్రారంభమైనప్పటికీ కౌలు రైతుల కష్టాలు తీరలేదు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అన్నింటా నష్టపోయిన కౌలు రైతులు... ఈ కూటమి ప్రభుత్వ హామీల అమలు కోసం ఎదురు చూస్తున్నారు.

8లో

మృత్యుఘోష

- ఊపందుకున్న సహాయ, రక్షణ చర్యలు
- గల్లంతైన వారి కోసం గాలింపు ముమ్మరం
- ఊహకందని బాధాకరమైన విపత్తు: విజయన్

వయనాడ్ విలయంలో 200 దాటిన మృతులు

తిరువనంతపురం: కేరళలోని వయనాడ్ లో మృత్యుఘోష కొనసాగుతోంది. కొండచరియలు విరిగిపడటంతో పాటు వరదలు ముంచెత్తిన ఘటనల్లో మృతుల సంఖ్య అంతకంతకూ పెరుగుతోంది. ఇప్పటి వరకూ అందిన తాజా సమాచారం ప్రకారం.. కొండచరియలు విరిగిపడిన ఘటనలో మృతుల సంఖ్య 200 దాటింది. కాగా గాయపడిన వాళ్లలో అనేకమంది పరిస్థితి విషమంగా ఉంది. రక్షించిన వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ప్రస్తుతం వయనాడ్‌లో విపత్తు నిర్వహణ బృందాలు, సైనికులు భారీ వర్షంలోనే సహాయక చర్యలు కొనసాగిస్తు న్నారు. ఆర్మీ జాగిలాలతో శిథిలాల కింద తనిఖీలు చేపట్టారు. కాగా కొండచరియలు విరిగిపడిన దుర్ఘటనలో మరో 200 మంది గాయపడ్డారు. ఇక 180 మంది గల్లంతవ్వగా వారికోసం గాలింపు చర్యలు కొనసాగుతు న్నాయి. ఇప్పటివరకు వెలికితీసిన 143 మృతదేహాలకు పోస్టుమార్టం పూర్తి కాగా... 32 మృతదేహాలను అధికారులు బాధిత

- మిగతా 2 లో

సాగుకు సుగమం...

9 శాతం వర్షాలు అధికం

న్యూఢిల్లీ : దేశంలో వ్యవసాయ రంగానికి ఊతమిచ్చేలా... సాగుకు సుగమం అయ్యేలా వర్షాలు కురుస్తున్నాయి. వాతావరణ శాఖ బుధవారం వెల్లడించిన గణాంకాల ప్రకారం, ప్రారంభ రుతుపవనాల వల్ల దేశంలో ఈ జులైలో వర్షపాతం 9 శాతం పెరిగింది. ఈ సకాలంలో రుతుపవనాలు మధ్య, దక్షిణ రాష్ట్రాలను సుసంపన్నం చేయడమే కాకుండా దేశ వ్యవసాయ ఆర్థిక వ్యవస్థలో కీలక పాత్ర పోషించాయి. భారతదేశానికి చెందిన 3.5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థకు జీవనాడి అయిన రుతుపవనాలు వ్యవసాయానికి, నీటి వనరులను నింపడానికి అవసరమైన దాదాపు 70 శాతం వర్షాన్ని అందిస్తుంది. నీటిపారుదల లేకుండా భారతదేశ వ్యవసాయ భూమిలో దాదాపు సగం ఈ వార్షిక వర్షాలపై ఆధారపడి ఉంది. తూర్పు, ఈశాన్య ప్రాంతాలలో 23.3

- మిగతా 2 లో

ఇజ్రాయిల్ ప్రతీకార దాడిలో
హమాస్ అగ్రనేత హతం

ఇరాన్ ధ్రువీకరణ

టెహ్రాన్/గాజా/దోహా/బీరుట్: ఇజ్రాయిల్ జరిపిన ప్రతీకార దాడిలో హమాస్ పొలిట్‌బ్యూరో అధ్యక్షుడు ఇస్మాయిల్ హనియే, ఆయన బాడీగార్డుల్లో ఒకరు ఇరాన్ రాజధాని టెహ్రాన్‌లో హత్యకు గురయ్యారు. ఈ మేరకు ఇరాన్ ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్స్ కార్ప్స్ (ఐఆర్‌జీసీ) తెలిపింది. బుధవారం ఉదయం టెహ్రాన్‌లోని నివాసంలో ఇస్మాయిల్, ఆయన బాడీగార్డు హత్యకు గురైనట్లు ఒక ప్రకటన చేసింది. ఈ ఘటనపై దర్యాప్తు జరుగుతున్నట్లు పేర్కొంది. ఇజ్రాయిల్ దాడిలో తమ నాయకుడు హతమైనట్లు ఇస్లామిక్ హమాస్ మూవ్‌మెంట్ ధ్రువీకరించింది. ఇరాన్ అధ్యక్షుడి ప్రమాణ స్వీకారానికి హాజరయ్యేందుకు తమ నేత ఇరాన్ వెళ్లినట్లు పేర్కొంది. గాజా స్ట్రిప్‌లో పలస్తీనా, ఇజ్రాయిల్ మధ్య పోరునకు సంబంధించిన తాజా పరిణామాలపై ఇరాన్ నూతన అధ్యక్షుడితో చర్చించాలని ఆయన భావించినట్లు హమాస్ వర్గాలు తెలిపాయి.

ఉగ్ర ఘాతుకం: అలీ హౌతీ

ఇస్మాయిల్ హనీయే హత్యను హేయమైన ఉగ్ర ఘాతుకంగా హౌతీలు పేర్కొన్నారు. యెమన్‌కు చెందిన హౌతీల అత్యున్నత రాజకీయ మండలి సభ్యుడు మహమ్మద్ అలీ హౌతీ ఈ ఘటనను తీవ్రంగా ఖండించారు. టెహ్రాన్‌లోని నివాసంపై ఇజ్రాయిల్ దాళాలు దాడికి తెగబడి ఆయనను హతమార్చినట్లు ఒక ప్రకటన చేశారు. చట్టాలు, నైతిక విలువలను ఇజ్రాయిల్ పూర్తిస్థాయిలో అతిక్రమించిందని, చట్టవిరుద్ధంగా, అనైతికంగా వ్యవహరించిందని 'ఎక్స్'లో పేర్కొన్నారు.

హెజ్బుల్లా, లెబనాన్ ప్రధాని ఖండన

హమాస్ పొలిట్‌బ్యూరో చీఫ్ ఇస్మాయిల్ హనేయే హత్యను హెజ్బుల్లాతో పాటు లెబనాన్ ప్రధాని నజీబ్ మికతీ తీవ్రంగా ఖండించారు. ప్రాదేశికంగానే కాకుండా అంతర్జాతీయ స్థాయిలో పొంచివున్న ముప్పునకు ఇస్మాయిల్ హత్య సంకేతమని కేబినెట్ సమావేశంలో నజీబ్ ఆందోళన వ్యక్తంచేశారు. లెబనీస్ తీవ్రవాద సంస్థ, రాజకీయ పార్టీ హెజ్బుల్లా ఒక ప్రకటనలో ఇస్మాయిల్ హత్యను ఆక్షేపించింది. ప్రస్తుత శకంలో గొప్ప తిరుగుబాటు నేతల్లో ఒకరిగా ఇస్మాయిల్‌ను వర్ణించింది. అమెరికా హెగెమోనీ ప్రాజెక్టు, జియోనిస్ట్ దురాక్రమణను ధైర్యంగా ఎదుర్కొన్న నేతగా పేర్కొన్నది. ఇస్మాయిల్ హనేయే బలిదానంతో ప్రతిఘటన మరింత తీవ్రతరం చేస్తామని హెజ్బుల్లా సంకల్పించింది.

హింసను ఆక్షేపిస్తాం: చైనా

హమాస్ నేత ఇస్మాయిల్ హత్యను చైనా ఆక్షేపించింది. ఏ రూపంలోనూ హింసను తమ దేశం ప్రోత్సహించబోదని చైనా విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి లిన్ జియాన్ ఒక ప్రకటన చేశారు. ప్రాదేశిక వివాదాలకు చర్చలతోనే పరిష్కారమన్నది చైనా ఉద్ఫోధ అని నొక్కిచెప్పారు. తాజా పరిణామం ఆందోళన కలిగించేదని, ప్రాదేశికంగా సుస్థిరత మరింత పెరుగుతుందని అభిప్రాయపడింది. పోరు తీవ్రతరం కాకుండా గాజాలో శాశ్వత కాల్పుల విరమణ దిశగా చర్యలు తీసుకోవాలని సూచించింది.

అనూహ్య పరిణామాలకు దారితీయొచ్చు: కేకేఈ

హమాస్ అగ్ర నాయకుడిని ఇజ్రాయిల్ హత్య చేయడంతో పశ్చిమాసియాలో పరిస్థితులు మరింతగా క్షీణించే ప్రమాదం ఉందని గ్రీస్ కమ్యూనిస్టు పార్టీ (కేకేఈ) హెచ్చరించింది. ఇజ్రాయిల్ నేరాలకు వ్యతిరేక పోరాటాన్ని మరింత బలోపేతం చేసుకోవాలని పిలుపునిచ్చింది. ఇందులో గ్రీక్ ప్రభుత్వం కీలకంగా వ్యవహరించాలని కోరింది. సామ్రాజ్యవాద నేరాలను ఎదుర్కొంటున్న పలస్తీనా ప్రజలకు, లెబనాన్‌కు సంపూర్ణ సంఘీభావం తెలపాలని పేర్కొంది. తమ వైఖరిని మార్చుకొని ఇజ్రాయిల్‌కు వంత పాడటం మానేయాలని గ్రీస్ ప్రభుత్వానికి కేకేఈ హితవు పలికింది.

ఇరాన్ తొమ్మిదో అధ్యక్షుడిగా పెజెష్కియన్ ప్రమాణం

టెహ్రాన్: ఇరాన్ తొమ్మిదో అధ్యక్షుడిగా మసూద్ పెజెష్కియన్ ప్రమాణ స్వీకారం చేశారు. ప్రమాణ స్వీకారోత్సవం టెహ్రాన్ పార్లమెంటులో జరిగినట్లు అధికారిక ఐఆర్ఎన్ఏ వార్తాసంస్థ పేర్కొంది. కార్యక్రమాన్ని అగ్రస్థాయి అధికారులు, సైన్యాధికారులతో పాటు 88 దేశాలు, పది అంతర్జాతీయ సంఘాల ప్రతినిధులు హాజరయ్యారు. ప్రమాణ స్వీకారం అనంతరం పెజెష్కియన్ ప్రసంగించారు. తన ప్రభుత్వ లక్ష్యాలను తెలిపారు. ఇరాన్ ఆర్థికాభివృద్ధి, దేశ ప్రయోజనాలు, పౌరుల జీవితాల మెరుగుదలకు తన వంతు కృషి చేస్తానని సంకల్పించారు. కీలకమైన విదేశీ విధానాల ఉద్దేశాలను ప్రధానంగా వెల్లడించారు. గాజాలో ఇజ్రాయిల్ చర్యలను ఖండించారు. పిల్లలు, మహిళలు సహా పౌరుల జీవితాలను దుర్భరం చేసే బాంబు దాడులను, వాటిని సమర్థించే వారిని తీవ్రంగా ఆక్షేపించారు. జులై 6న జరిగిన అధ్యక్ష ఎన్నికల్లో పెజెష్కియన్ (69) విజేతగా నిలిచారు. ఆయనను తొమ్మిదో దేశాధ్యక్షుడిగా అత్యున్నత నాయకుడు అలీ ఖమేనీ ఆదివారం ప్రకటించారు. దీంతో తాను ప్రతిపాదించిన కేబినెట్‌కు పార్లమెంటు ఆమోదం పొందేందుకుగాను పెజెష్కియన్‌కు 15 రోజుల సమయం ఉన్నది.

యూపీఎస్‌సీ చైర్మన్‌గా ప్రీతి సుదాన్ నియామకం

(మొదటిపేజీ తరువాయి)

గుజరాత్‌కు చెందిన మనోజ్ సోని ఉన్నారు. 2029 చివర వరకు ఆయన ఆ పదవిలో కొనసాగవలసి ఉంది. కానీ వ్యక్తిగత కారణాలతో ఆయన ఆ పదవికి రాజీనామా చేశారు. మరోవైపు కొద్ది రోజుల ముందే మహారాష్ట్రలోని పుణె ట్రెయినీ కలెక్టర్ పూజా ఖేద్కర్ వ్యవహార శైలి వివాదాస్పదంగా మారింది. దానితోపాటు ఆమె దివ్యాంగుల కోటాలో ఐఏఎస్ పదవికి ఎంపికయ్యారంటూ ఆరోపణలు వెల్లువెత్తాయి. అలాంటి సమయంలో యూపీఎస్‌సీ చైర్మన్ పదవికి మనోజ్ సోని రాజీనామా చేశారు. దీంతో ఆయన రాజీనామా రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. పూజా ఖేద్కర్ అంశానికి మనోజ్ సోని రాజీనామాకు ఎటువంటి సంబంధం లేదని ఇప్పటికే కేంద్రం స్పష్టత ఇచ్చింది. 1983 బ్యాచ్ ఐఏఎస్ అధికారి ప్రీతి సుదాన్. ప్రీతి సుదాన్ భర్త రణదీప్ సుదాన్ సైతం ఐఏఎస్ అధికారే. వీరిద్దరు ఆంధ్రప్రదేశ్ కేడర్ ఐఏఎస్‌లు. ఉమ్మడి ఏపీలోని వివిధ జిల్లాలకు వీరిద్దరు కలెక్టర్లుగా పని చేశారు.

పూజా ఖేద్కర్ ఐఏఎస్ అభ్యర్థిత్వం రద్దు

(మొదటిపేజీ తరువాయి)

పాటు యూపీఎస్సీలో తప్పుడు అఫిడవిట్ పత్రాలు సమర్పించారనే ఆరోపణలు వచ్చిన సంగతి విదితమే. దీంతో ఈ వ్యవహారంపై యూపీఎస్సీ దర్యాప్తు చేపట్టింది. ఈ క్రమంలోనే ఆరోపణలపై వివరణ ఇవ్వాలంటూ ఖేద్కర్‌కు షోకాజ్ నోటీసులు జారీ చేసింది. అయితే, దీనికి ఆమె నుంచి ఎలాంటి స్పందన రాకపోవడంతో చర్యలు తీసుకున్నట్లు కమిషన్ పేర్కొంది. 'జులై 25లోగా నోటీసులకు సమాధానం ఇవ్వాలని ఆదేశించాం. కానీ, ఆమె ఆగస్టు నాలుగవ తేదీ వరకు గడువు కావాలని కోరింది. ఇందుకు తిరస్కరించి... జులై 30 వరకు అదనపు సమయం కల్పించాం. ఇదే చివరి అవకాశమని... ఎలాంటి పొడిగింపులు ఉండవని స్పష్టంచేశాం. కానీ, ఆమె గడువులోగా తమ సమాధానాన్ని సమర్పించలేదు. అందువల్ల సివిల్ సర్వీసెస్ ఎగ్జామ్-2022లో ఆమె ప్రొవిజినల్ అభ్యర్థిత్వాన్ని రద్దు చేస్తున్నాం. భవిష్యత్తులో కమిషన్ నిర్వహించే నియామక పరీక్షలు/ఎంపికలకు హాజరుకాకుండా శాశ్వతంగా డిబార్ చేస్తున్నాం' అని యూపీఎస్సీ ఓ ప్రకటనలో వెల్లడించింది. యూపీఎస్సీ పరీక్ష నిబంధనల్ని అతిక్రమిస్తూ అవకాశాలు వాడుకొని ఆమె నకిలీ పత్రాలతో పరీక్షను క్లియర్ చేసినట్లు గుర్తించామని గతంలో కమిషన్ పేర్కొంది. తన పేరు, తల్లిదండ్రుల పేర్లు, ఫొటోగ్రాఫ్/సంతకం, ఈ-మెయిల్ ఐడీ, మొబైల్ నంబర్, చిరునామాకు సంబంధించిన పత్రాలన్నీ మార్చడం ద్వారా మోసపూరిత ప్రయత్నాలకు పాల్పడ్డారని వెల్లడించింది. ఈ క్రమంలోనే ఆమె ప్రొబేషన్‌ను నిలిపివేసి... ముస్సోరిలోని లాల్‌బహదూర్ శాస్త్రి జాతీయ అకాడమీకి తిరిగి రావాలని ఆదేశించగా ఆమె అక్కడికి వెళ్లలేదు. మరోవైపు, చీటింగ్-ఫోర్జరీ ఆరోపణలకు సంబంధించి ఇప్పటికే ఆమెపై పోలీసులు కేసు నమోదు చేశారు. దీంతో ముందస్తు బెయిల్ నిమిత్తం ఆమె ఇటీవల దిల్లీ కోర్టును ఆశ్రయించింది. దీనిపై గురువారం న్యాయస్థానం తీర్పు వెలువరించనుంది.

(మొదటిపేజీ తరువాయి)

మారిందని, ప్రతి బడ్జెట్‌లో కేటాయింపులు ఉంటాయని, ఖర్చులు మాత్రం పెట్టబోరని చెప్పారు. అదే రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఒక హక్కుగా వస్తే ప్రయోజనం ఉంటుందన్నారు. ప్రభుత్వం ఎక్కడ తప్పు చేసినా తాము ప్రశ్నిస్తామని, కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ అందంగా అబద్ధాలు చెబుతారని ఎద్దేవా చేశారు. జాతీయ రహదారుల గురించి మాట్లాడుతున్నారు గానీ... సర్వీస్ రోడ్లు పట్టించుకోవడం లేదన్నారు. దీంతో రైతు ఒక పొలం నుంచి మరో పొలంలోకి వెళ్లే పరిస్థితి ఉండబోదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ అంశాన్ని పట్టించుకోవడం లేదని చెప్పారు. కేంద్రం చేస్తున్న సాయం శాశ్వతమైనది కాదని స్పష్టం చేశారు. గత ప్రభుత్వంలో బాధితులు బయటకు రాలేదని, ఇప్పుడు పూర్తి వివరాలతో తాము సీఎం వద్దకు వచ్చామని చెప్పారు. ప్రత్యేక హోదా కోసం చంద్రబాబు గట్టిగా పోరాటం చేయాల్సిన అవసరముందని సూచించారు.

భూ దోపిడీపై విచారణ

గత సీఎం జగన్‌మోహన్‌రెడ్డి భారీగా సంక్షేమ పథకాలు ఇచ్చారని, అయినా దారుణంగా ఓటమి చెందారన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో రాజకీయపక్షంగా ఒక వైఖరి తీసుకున్న వాళ్లే గెలిచారని, తీసుకోకుండా తొండాట ఆడిన వారు ఓడిపోయారన్నారు. మాయావతి, నవీన్ పట్నాయక్, కేసీఆర్, జగన్ ఓడిపోయారని వ్యాఖ్యానించారు.

సీఎం, నారాయణ మధ్య ఆసక్తికర చర్చ

ఈ సందర్భంగా సీఎం చంద్రబాబుకు, సీపీఐ నేత నారాయణ మధ్య కాలేజీ రోజుల అంశంపై ఆసక్తికరచర్చ జరిగింది. నాడు చేసిన రాజకీయ పోరాటాలు, విద్యార్థి రాజకీయాలను నెమరువేసుకుని కాసేపు ఉల్లాసంగా గడిపారు.

సీఎం దృష్టికి విశాఖ ఉక్కు, రైల్వేజోన్: రామకృష్ణ

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడుతూ వామపక్షాల అధ్వర్యంలో తలపెట్టిన పోరాటాలను గత ప్రభుత్వం ఉక్కుపాదంతో అణచివేసిందన్నారు. తమ ప్రజా ఉద్యమాలకు సంబంధించి 26 జిల్లాల్లో కేసులు పెట్టారని, వాటిని వెనక్కి తీసుకోవాలని కోరగా... సీఎం చంద్రబాబు సానుకూలంగా స్పందించారన్నారు. విశాఖ ఉక్కు, రైల్వే జోన్ అంశాలను సీఎం దృష్టికి తీసుకెళ్లామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది ఎకరాల భూములు అన్యాక్రాంతమయ్యాయని, చివరకు మఠం భూములను కూడా దోచేశారని చెప్పారు. విశాఖ స్టీల్ ప్లాంట్ విషయంలో కేప్టివ్ మైన్స్ ఇవ్వాలని, సెయిల్ అధ్వర్యంలో నడపాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా భూములు పోగొట్టుకున్న వారందర్నీ సమీకరిస్తున్నామని తెలిపారు. వారం, పది రోజుల్లో బాధితులతో ఈ సమావేశం ఏర్పాటు చేస్తామన్నారు. మూడు రాజధానుల పేరుతోనూ విశాఖపట్నం, విజయనగరం, ప్రకాశం జిల్లాల్లో వేలాది ఎకరాలు అన్యాక్రాంతం చేసిన వైనాన్ని సీఎం దృష్టికి తీసుకొచ్చామని తెలిపారు. పేద, సామాన్య, మధ్యతరగతి వర్గాల ప్రజలను బెదిరించి గత పాలకులు భూములు కాజేశారని తెలిపారు. భూములు కోల్పోయిన వారికి న్యాయం చేయాలని, భూ కుంభకోణానికి పాల్పడినవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరామన్నారు.

ఐదు కొత్త పాలసీలు

(మొదటిపేజీ తరువాయి)

విధానాల కారణంగా పారిశ్రామికవేత్తలు వెనక్కి వెళ్లిపోయారని సీఎం అన్నారు. పారిశ్రామికవేత్తలను ఇబ్బందులు పెట్టడం, రాజకీయ వేధింపులకు గురిచేయడంతో చాలా కంపెనీలు పెట్టుబడుల ఒప్పందాలు రద్దు చేసుకున్నాయని, కొత్త కంపెనీలు రాలేదని, మళ్లీ పారిశ్రామికవేత్తల్లో నమ్మకం కల్పించాల్సిన అవసరం ఉందని చెప్పారు. పారిశ్రామిక అవసరాల కోసం తీసుకున్న భూములనూ ఇతర అవసరాలకు వినియోగించారని సీఎంకు అధికారులు వివరించారు. వివిధ ప్రాంతాల్లో పరిశ్రమల కోసం సేకరించిన భూముల్లో 1,382 ఎకరాలను ఇళ్ల పట్టాల కోసం తీసుకున్నారని అధికారులు తెలిపారు. పేదలకు ఇళ్లు ఇచ్చేందుకు అవసరమైన స్థలం సేకరించి ఇవ్వాల్సి ఉన్నప్పటికీ...పరిశ్రమలకు కేటాయించిన స్థలాలు ఇచ్చారని వివరించారు. పరిశ్రమలకు గత టీడీపీ ప్రభుత్వం 66 శాతం ప్రోత్సాహకాలు చెల్లిస్తే... వైసీపీ ప్రభుత్వం 34 శాతం మాత్రమే ఇచ్చారని తెలిపారు. దీనిపై సీఎం మాట్లాడుతూ పారిశ్రామిక ప్రోత్సాహకాలు ఇచ్చే అంశాన్ని పరిశీలిద్దామని, తద్వారా పెట్టుబడులకు ఆస్కారం ఏర్పడుతుందని అభిప్రాయపడ్డారు. 2014-2019 కాలంలో 64 పారిశ్రామిక పార్కుల ద్వారా 14,125 ఎకరాలు అందుబాటులోకి తెస్తే... 2019-2024 మధ్య కేవలం 31 పార్కులు వచ్చాయని సీఎం వివరించారు. ఇలాంటి పరిణామాలతో పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులు నమ్మకం కోల్పోయారని, నాడు ఒప్పందం చేసుకుని వైసీపీ ప్రభుత్వ విధానాలతో వెనక్కి వెళ్లిన వారితో మళ్లీ సంప్రదింపులు జరపాలని, అవసరమైతే తాను కూడా వారితో మాట్లాడతానని సీఎం చెప్పారు. ఇప్పటికే పనులు ప్రారంభించిన ప్రాజెక్టులను వేగవంతం చేయాలని, తద్వారా ఏడాది కాలంలో లక్ష కోట్ల పెట్టుబడులకు సంబంధించిన ప్రాజెక్టులు పూర్తిచేసి 1,36,260 మందికి ఉపాధి కల్పించాలని ఆదేశించారు. ఉమ్మడి కృష్ణా జిల్లా మల్లవల్లి పారిశ్రామికవాడలో భూముల ధరలు తగ్గించి, పెట్టుబడులకు ఊతం ఇవ్వాలని, వైసీపీ ప్రభుత్వం దీన్ని పూర్తిగా వివాదాల్లోకి నెట్టేసి నిర్వీర్యం చేసిందన్నారు.

సాగుకు సుగమం...

(మొదటిపేజీ తరువాయి)

శాతం లోటు ఉన్నప్పటికీ, జులైలో దక్షిణ, మధ్య ప్రాంతాలలో అసాధారణంగా 33 శాతం ఎక్కువ వర్షపాతం నమోదయింది. వాయువ్య వర్షాలలో 14.3 శాతం లోటుతో జులైలో అధికంగా వర్షాలు కురిసి... జూన్‌లోని 10.9 శాతం లోటును భర్తీ చేశాయి. జూన్ 1న రుతుపవనాలు ప్రారంభమైనప్పటి నుంచి 1.8 శాతం ఎక్కువ వర్షపాతం నమోదయింది. అకాల వర్షాలు రైతులు వేసవిలో అవసరమైన వరి, పత్తి, సోయాబీన్లు, చెరకు వంటి పంటలను వేగవంతం చేయడానికి అనుమతించాయి.

మోదీపై సభా హక్కుల ఉల్లంఘన తీర్మానం

(మొదటిపేజీ తరువాయి)

నిలిచారు. దీంతో ప్రధాని నరేంద్ర మోదీకి వ్యతిరేకంగా లోక్‌సభలో సభాహక్కుల ఉల్లంఘన తీర్మానం (ప్రివిలేజ్ మోషన్) ప్రవేశపెట్టాలని కాంగ్రెస్ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు కాంగ్రెస్ ఎంపీ, పంజాబ్ మాజీ ముఖ్యమంత్రి చరణ్‌జీత్ సింగ్ చన్నీ బుధవారం ప్రధాని మోదీకి వ్యతిరేకంగా లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లాకు నోటీసు సమర్పించారు. బీజేపీ ఎంపీ అనురాగ్ ఠాకూర్ చేసిన వ్యాఖ్యలలో రికార్డుల నుంచి తొలగించబడిన భాగాలపై ఆయన 'ఎక్స్' లో ట్వీట్ చేసిన మొత్తం ప్రసంగంతో కూడిన వీడియోతో పాటు ప్రివిలేజ్ మోషన్ నోటీసును చన్నీ సమర్పించారు. బీజేపీ ఎంపీ అనురాగ్ ఠాకూర్ చేసిన కొన్ని అభ్యంతరకర వ్యాఖ్యలను అధ్యక్ష స్థానంలో ఉన్న జగదాంబికా పాల్ తొలగిస్తున్నట్లు ప్రకటించగా... ప్రధాని వాటిని ట్వీట్ చేయడం, అందరూ వినాలని ప్రచారం చేయడం ద్వారా సభ హక్కుల్ని ధిక్కరించారని పేర్కొంటూ లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు ఆయన లేఖ రాశారు. మంగళవారం అనురాగ్ ఠాగూర్ ప్రసంగాన్ని మోదీ ప్రశంసించారు. అంతేకాదు అందరు వినాల్సిన ప్రసంగం అంటూ మోదీ ట్వీట్ చేశారు. దీనిపై కాంగ్రెస్ అభ్యంతరం తెలిపింది. లోక్‌సభ సమావేశాలపై ప్రధాన సమస్యలపై అధికార, విపక్షాల మధ్యవాగ్వాదం చోటు చేసుకుంది. మరీ ముఖ్యంగా కులగణనపై కాంగ్రెస్‌తో పాటు రాహుల్ గాంధీపై బీజేపీ ఎంపీ అనురాగ్ ఠాకూర్ విరుచుకు పడ్డారు. ఈ సందర్భంగా సభలో ఠాకూర్ చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారాన్ని రేపాయి. అంతే దీటుగా రాహుల్ గాంధీ బదులిచ్చారు. వెనుకబడిన వర్గాల కోసం పోరాడే వారికి అవమానాలు తప్పవని అన్నారు. ఇలాంటి అవమానాలు ఎన్ని ఎదురైన తన పోరాటం ఆగదని వ్యాఖ్యానించారు. కులగణన బిల్లును లోక్‌సభలో ఆమోదింప జేసుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. ఈ తరుణంలో లోక్‌సభలో అనురాగ్ ఠాకూర్ చేసిన ప్రసంగంపై ప్రధాని మోదీ ప్రశంసల వర్షం కురిపించారు. విపక్షనేత రాహుల్ గాంధీకి కౌంటర్ ఇవ్వడాన్ని ప్రశంసిస్తూ... ఠాకూర్ ప్రసంగాన్ని తప్పకుండా వినాలని అన్నారు. 'యువనేత అనురాగ్ ఠాకూర్ చేసిన ప్రసంగాన్ని తప్పకుండా వినాలి. వాస్తవాలు, హాస్యచతురతతో కూడిన ఆయన ప్రసంగం ఇండియా కూటమి దుర్మార్గపు రాజకీయాల్ని బహిర్గతం చేసింది'అని 'ఎక్స్'లో పోస్ట్ చేశారు మోదీ.

మార్పు అనివార్యం

(మొదటిపేజీ తరువాయి)

పాలక మండలిలో ఎంప్లాయీస్ యూనియన్ తరఫున ఒకరికి ప్రాతినిధ్యం కల్పించాలని ఆయన సూచించారు. ఉద్యోగులకు విశ్వాసం కలిగించే రీతిలో యాజమాన్యం వ్యవహరించాలన్నారు. ప్రపంచ ధనవంతుల్లో రెండు, మూడు స్థానాల్లో నిలిచిన వ్యక్తుల పేర్లను పార్లమెంట్‌లో ప్రస్తావించకూడదని లోక్‌సభ స్పీకర్ ఆదేశించటం విడ్డూరంగా ఉందని శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. కరోనా సమయంలో రోజుకు వెయ్యికోట్ల రూపాయల ఆదాయాన్ని అదానీ సంస్థలు ఆర్జించాయన్నారు. పేదలకు ఉపయోగపడేలా రాజ్యాంగం మార్చాలని డిమాండ్ చేయాల్సిన వామపక్షాలు....ఇప్పుడు కనీసం ఉన్న రాజ్యాంగాన్ని కాపాడుకుందాం అనే స్థాయికి చేరాయని, అంటే బీజేపీ పాలనలో రాజ్యాంగానికి ఎలాంటి పరిస్థితి ఏర్పడిందో అర్థమవుతోందని శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. వామపక్ష పార్టీల ద్వారానే రాజకీయాల్లో మార్పు రావాల్సిన అవసరం ఉందని ఆయన వ్యాఖ్యానించారు. గతంలో అణు ఒప్పందం తప్పని యూపీఏ ప్రభుత్వం నుంచి వామపక్షాలు బయటకు వచ్చాయని, ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ కూడా అదే విషయం చెబుతోందన్నారు.

విశాలాంధ్ర విజ్ఞాన సమితి అధ్యక్షుడు ముప్పాళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ వ్యాపారం, రాజకీయ ప్రయోజనాల కోసం విశాలాంధ్ర ఏర్పడలేదన్నారు. సామాజిక, సాంస్కృతిక చైతన్యం కోసం ఏర్పాటు చేశారన్నారు. ఎంతటి సంక్లిష్ట పరిస్థితులు ఎదురైనా ఉద్యోగులు ముందుండి సంస్థను కాపాడారని గుర్తు చేశారు. ఎంప్లాయీస్ యూనియన్, యాజమాన్యం సఖ్యతతో ముందుకు సాగుతున్నాయని చెప్పారు. విశాలాంధ్ర విజ్ఞాన సమితి కార్యదర్శి, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ మాట్లాడుతూ విశాలాంధ్ర అభివృద్ధికి సంబంధించి విజ్ఞాన సమితికి ఎంత బాధ్యత ఉందో... అంతే బాధ్యత ఎంప్లాయీస్ యూనియన్‌పై కూడా ఉందన్నారు. పత్రికపై ప్రభుత్వాలు కక్ష కట్టినా దీటుగా ఎదుర్కొని నడిపారని, ఓర్పుగా ఉద్యోగులు పని చేశారని కొనియాడారు. విశాలాంధ్ర విజ్ఞాన సమితి కోశాధికారి జి.ఓబులేసు మాట్లాడుతూ ఉద్యోగుల సాధక బాధకాలను యాజమాన్యానికి అర్థం అయ్యేలా చెప్పటానికి యూనియన్ అవసరం ఉందన్నారు. సంస్థ ఆర్థిక పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని యూనియన్ పని చేయాలన్నారు. అభ్యుదయ సమాజమే విశాలాంధ్ర లక్ష్యమని, ప్రత్యామ్నాయ జర్నలిజాన్ని జాగ్రత్తగా ప్రజల వద్దకు తీసుకెళ్లాలని సూచించారు. ప్రజాపక్షం దినపత్రిక సంపాదకులు మక్కెన సుబ్బారావు మాట్లాడుతూ జర్నలిజానికే కాకుండా జర్నలిస్టులకు కూడా విశాలాంధ్ర ఎంప్లాయాస్ యూనియన్ నాయకత్వం వహించిందన్నారు. పత్రిక ముద్రణ కోసం డీటీపీ విధానాన్ని మొదటిసారి ప్రవేశపెట్టింది విశాలాంధ్ర పత్రికేనన్నారు. విశాలాంధ్ర ఎంప్లాయీస్ యూనియన్ ఏర్పడిన పరిస్థితులు, ఎదురైన సమస్యలను సోదాహరణగా వివరించారు. ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు ఐవీ సుబ్బారావు మాట్లాడుతూ విశాలాంధ్ర అభివృద్ధికి ఏపీయూడబ్ల్యూజే పూర్తి సహకారం అందిస్తుందన్నారు. సీనియర్ పాత్రికేయులు ఎస్‌కే బాబు మాట్లాడుతూ యాజమాన్యం, యూనియన్ పరస్పర అంగీకారంతో సమస్యలు పరిష్కరించుకోవాలని సూచించారు. వజ్రోత్సవాన్ని పురస్కరించుకుని విశాలాంధ్ర ఎంప్లాయీస్ యూనియన్‌లో పనిచేసిన సీనియర్ నాయకులను అతిథులు ఘనంగా సత్కరించారు. విశాలాంధ్ర ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ కూన అజయ్‌బాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో విశాలాంధ్ర విజ్ఞాన సమితి జనరల్ మేనేజర్ పి.హరినాథరెడ్డి, ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చందు జనార్ధన్, ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు బి.వెంకటేశ్వరరావు, ఎం.మురళీకృష్ణ పాల్గొన్నారు. ముందుగా సీహెచ్ అజయ్‌కుమార్ శిష్యబృందం ప్రదర్శించిన కూచిపూడి నృత్యం అబ్బురపరిచాయి. ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షుడు పి.చంద్రనాయక్, కోశాధికారి ఆర్.పిచ్చయ్య ఆలపించిన అభ్యుదయ గీతాలు, సీనియర్ పాత్రికేయులు రొమిలా ఆలపించిన పాట అందరినీ అలరించాయి. వజ్రోత్సవానికి విశాలాంధ్ర పూర్వ ఉద్యోగులు, సిబ్బంది, కుటుంబ సభ్యులు హాజరయ్యారు.

మృత్యుఘోష

(మొదటిపేజీ తరువాయి)

కుటుంబాలకు అప్పగించారు. సుమారు 78 మృతదేహాలను మెప్పాడి సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఉంచారు. మరో 32 మంది మృతదేహాలను నీలంబుర్ జిల్లా ఆస్పత్రిలో ఉంచారు. కాగా 91 మంది గల్లంతు కాగా... 191 మంది ఆస్పత్రి పాలయినట్లు చెబుతున్నారు.

- వయనాడ్‌తో పాటు మరో ఏడు జిల్లాలకు వాతావరణశాఖ రెడ్ అలర్ట్ ప్రకటించింది. దీంతో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. ఇక వయనాడ్‌లో కొండచరియలు విరిగిపడిన ప్రాంతాల్లో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. వరదలో సర్వం కోల్పోయిన వాళ్ల కోసం ఆహారం, బట్టలు, మందులు అందించేందుకు, రక్తదానం కోసం.. ఆర్థిక సాయం అందించేందుకు దాతలు ముందుకు వస్తున్నారు. సోషల్ మీడియాలోనూ ప్రే ఫర్ వయనాడ్ లాంటి హ్యాష్ ట్యాగ్‌లు ట్రెండ్ అవుతున్నాయి. విపత్తు నిర్వహణ బృందాలు, సైనికులు సహాయక చర్యలు కొనసాగిస్తున్నారు. సహాయ బృందాలు చలియార్ నది నుంచి 15 మృతదేహాల్ని బయటకు తీశాయి.
- ఇక ముండక్కై గ్రామం శివారులోని ఎలా రిసార్ట్, వన రాణి రిసార్ట్‌లలో తలదాచుకున్న 19 మందిని సైన్యం రక్షించింది. కాగా సైన్యం యుద్ధ ప్రాతిపాదికన ముండక్కై చురాల్‌మల్ మధ్య వారధి నిర్మాణం చేపట్టింది. ఇది పూర్తయితే అంబులెన్స్‌లతో పాటు ఆహారం, తాగునీరు సరఫరా చేసేందుకు అధికారులు సిద్ధమైనారు. ఇప్పటివరకు 481 మందిని రక్షించినట్లు సహాయక బృందాలు ప్రకటించాయి. కాగా జాడ తెలియకుండా పోయిన వందలమంది తేయాకు, కాఫీతోటల కార్మికుల ఆచూకీ తెలియరాలేదు.

కారు ప్రమాదానికి గురైన మంత్రి వీణా జార్జ్

కేరళ ఆరోగ్య మంత్రి వీణా జార్జ్‌కు త్రుటిలో ప్రాణాపాయం తప్పింది. ఆమె ప్రయాణిస్తున్న కారు రోడ్డు ప్రమాదానికి గురైంది. ఈ ఘటనలో మంత్రి గాయాలతో బయటపడ్డారు. వయనాడ్‌కు వెళ్తుండగా ఈ ప్రమాదం సంభవించినట్లు అధికారులు తెలిపారు. మలప్పురం జిల్లాలో మంత్రి ప్రయాణిస్తున్న కారు ప్రమాదానికి గురైంది. మంజేరిలోని చెట్టియాంగడి వద్ద ఎదురుగా వస్తున్న స్కూటర్‌ను తప్పించబోయి కారు విద్యుత్ స్తంభాన్ని ఢీ కొట్టింది. ఈ ఘటనలో మంత్రికి స్వల్ప గాయాలయ్యాయి. వెంటనే స్పందించిన సిబ్బంది మంత్రిని సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. మంత్రి వీణా జార్జ్ ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు రాష్ట్ర ఆరోగ్య శాఖ తెలిపింది.

క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్న కేంద్ర మంత్రి

మరోవైపు వయనాడ్‌లో కొండచరియలు విరిగిపడిన ప్రాంతాన్ని కేంద్ర మంత్రి జార్జి కురియన్ సందర్శించారు. ఆ ప్రాంతంలో క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్నారు. ప్రస్తుతం అక్కడ జరుగుతున్న సహాయక చర్యలు, ఇతర పరిస్థితులపై వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను, మృతుల కుటుంబాలను పరామర్శించారు. కాగా ప్రధానమంత్రి

నరేంద్ర మోదీ స్వయంగా వయనాడ్‌లో పరిస్థితిని పర్యవేక్షిస్తున్నట్లు రాజ్యసభలో ఓ ప్రశ్నకు సమాధానంగా హోంశాఖ సహాయమంత్రి నిత్యానందరాయ్ వెల్లడించారు. కేరళకు అన్నివిధాలుగా అవసరమైన సాయాన్ని కేంద్రం అందిస్తుందని తెలిపారు. రాష్ట్ర విపత్తు సహాయక నిధి (ఎస్‌డీఆర్ఎఫ్) నుండి ఇప్పటికే రూ.145 కోట్లు కేరళ ప్రభుత్వానికి విడుదల చేయడం జరిగిందని, ఇంకా ఎస్‌డీఆర్ఎఫ్‌లో రూ.394 కోట్లు మిగిలి ఉన్నట్లు తెలిపారు. పీఎం ఆదేశాల మేరకు కేంద్ర మంత్రి కురియన్ బాధిత ప్రాంతాల్లో పర్యటిస్తున్నట్లు వెల్లడించారు.

ప్రజలంతా సహకరించాలి: సీఎం విజయన్

వయనాడ్ లో కొండచరియలు విరిగిపడిన ప్రాంతంలో సహాయక చర్యలు పూర్తి స్థాయిలో కొనసాగుతున్నాయని కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ తెలిపారు. ఇప్పటి వరకూ 144 మృతదేహాలను వెలికి తీసినట్లు ప్రకటించారు. కొండచరియలు విరిగిపడిన ఘటనపై సీఎం మాట్లాడారు. ఇది ఊహించని, చాలా బాధాకరమైన విపత్తు అని పేర్కొన్నారు. 'వయనాడ్‌లో సహాయక చర్యలు పూర్తి స్థాయిలో కొనసాగుతున్నాయి. ఇది ఊహించని, అత్యంత బాధాకరమైన విపత్తు. సహాయ బృందాలు ఇప్పటి వరకూ 144 మృతదేహాలను వెలికితీశారు. అందులో 79 మంది పురుషులు, 64 మంది మహిళలు ఉన్నారు. ఇంకా 191 మంది గల్లంతయ్యారు. వారి కోసం గాలింపు ప్రయత్నాలు సాగుతున్నాయి. విపత్తు ప్రాంతం నుండి వీలైనంత ఎక్కువ మందిని తరలించేందుకు సహాయ బృందాలు శ్రమిస్తున్నాయి. వారి కోసం సమీపంలోని చర్చిలు, మదర్సాలలో తాత్కాలిక ఆసుపత్రులను ఏర్పాటు చేశాం. రక్షించిన వారికి అవసరమైన వైద్య చికిత్సను అందిస్తున్నాం' అని సీఎం పినరయి విజయన్ తెలిపారు. కాగా వయనాడ్ జిల్లాలో జరిగిన విధ్వంసం నుంచి కోలుకోవడానికి ప్రజలంతా సహాయ సహకారాలందించాలని విజయన్ పిలుపునిచ్చారు. పునర్నిర్మాణ కార్యక్రమాలకు సాయమందించాలని కోరారు. 2018 వరదల సమయంలో ప్రజలు అందించిన సహకారం మరువలేనిదని, అదే తరహా సాయం మళ్లీ కావాలని అన్నారు. ప్రతి ఒక్కరూ ముఖ్యమంత్రి సహాయ నిధికి విరాళాలు పంపించాలని సూచించారు.

ఇదీ జరిగింది...

కేరళలోని వయనాడ్ జిల్లా మెప్పడి, మండక్కై, చూరాల్‌మల, అట్టామల, నూల్‌పుజా గ్రామాల్లో సోమవారం అర్ధరాత్రి 2 గంటల సమయంలో ఒక్కసారిగా కొండ చరియలు విరిగిపడ్డాయి. దీంతో కొండ ప్రాంతం విధ్వంసమై, ఇళ్లన్నీ నేలమట్టమయ్యాయి. బురద మట్టిలో కూరుకుపోయారు. తొలుత మండక్కై ప్రాంతంలో కొండచరియలు విరిగిపడగా, సహాయక సిబ్బంది వెంటనే అక్కడకు వెళ్లి సహాయక చర్యలు చేపట్టారు. కొంత మంది బాధితులను సమీపంలోని చూరాల్‌మలలోని వెల్లారిమల పాఠశాలవద్ద ఏర్పాటు చేసిన సహాయక శిబిరానికి పంపించారు. మంగళవారం తెల్లవారుజామున 4.10 గంటలకు ఈ పాఠశాల సమీపంలో మరోసారి కొండచరియలు విరిగిపడ్డాయి. దీంతో శిబిరంసహా చుట్టుపక్కల ఇళ్లు, దుకాణాలు బురదలో కూరుకుపోయాయి. అనేక వాహనాలు అందులో ఇరుక్కుపోయాయి. మండక్కైలో మంగళవారం మధ్యాహ్నం మరోసారి కొండచరియలు విరిగిపడ్డాయి.

వయనాడ్‌కు రాహుల్, ప్రియాంక

లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంకాగాంధీ గురువారం వయనాడ్ ప్రాంతంలో పర్యటించనున్నట్లు తెలిసింది. బుధవారమే వీరిద్దరు వయనాడ్ వెళ్లాల్సి ఉండగా... ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలు, ప్రతికూల వాతావరణం ఫలితంగా హెలికాప్టర్ ల్యాండింగ్ కుదరదని అధికారులు తెలియజేయడంతో పర్యటన వాయిదా పడింది. వీరిద్దరు ప్రభుత్వ హయ్యర్ సెకండరీ స్కూల్, సెయింట్ జోసెఫ్ యుపి స్కూల్, మెప్పాడిలోని సహాయ శిబిరాలను సందర్శిస్తారని కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి. డాక్టర్ మూపెన్స్ మెడికల్ కాలేజీ, మెప్పాడిని కూడా సందర్శిస్తారని పేర్కొన్నాయి.

బడ్జెట్‌లో సాగుకు నిధులేవీ?

- పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలి
- 5న రాష్ట్ర వ్యాపిత ఆందోళనలు విజయవంతం చేయాలి
- ఏఐకేఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి రావుల వెంకయ్య

విశాలాంధ్ర-మదనపల్లె: రైతాంగం పండించే అన్ని రకాల పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించి రైతాంగాన్ని ఆదుకోవాలని అఖిల భారత కిసాన్ సభ (ఏఐకేఎస్) జాతీయ ప్రధాన కార్యదర్శి రావుల వెంకయ్య డిమాండ్ చేశారు. బుధవారం మూడవ రోజు మదనపల్లి ఎస్‌వీఆర్ కళ్యాణ మండపంలో ఏపీ రైతు సంఘం రాష్ట్ర స్థాయి సమ్మేళనం జరిగింది. ఈ సందర్భంగా రావుల వెంకయ్య మాట్లాడుతూ రైతాంగ సమస్యలపై, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల రైతాంగ వ్యతిరేక విధానాలపై మూడు రోజుల పాటు చర్చలు జరిగాయన్నారు. కేంద్రంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మూడు నల్ల వ్యవసాయ చట్టాలతో పాటు విద్యుత్ బిల్లులు తెచ్చి రైతాంగానికి తీవ్ర నష్టం చేశారని విమర్శించారు. బిల్లులు అమలైతే వ్యవసాయం మొత్తం కార్పొరేట్ మయం అయిపోతుందన్నారు. నల్ల చట్టాలకు వ్యతిరేకంగా దేశ వ్యాప్తంగా పెద్ద ఎత్తున రైతాంగ పోరాటాలు చేయడంతో ప్రధాని మోదీ రైతాంగానికి క్షమాపణలు చెప్పి సమస్యలు పరిష్కరిస్తామని చెప్పి నేటికీ అమలు చేయలేదని ధ్వజమెత్తారు. కేంద్ర బడ్జెట్‌లో రైతాంగానికి అవసరమైన చర్యలు తీసుకోలేదని, నిధులు కేటాయించలేదని, ప్రతి సంవత్సరం వ్యవసాయ రంగానికి బడ్జెట్‌లో కేటాయింపులు తగ్గిస్తుండటంతో రైతాంగం నష్టపోతున్నారన్నారు. రాష్ట్రంలో కృష్ణా, గోదావరి జలాల వినియోగంలో బచావత్ ట్రిబ్యునల్ ఇచ్చిన ఆదేశాల ప్రకారం అమలు చేయలేదని తెలిపారు. ఆగస్టు 5న రాష్ట్ర వ్యాపితంగా రైతాంగ సమస్యలు పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కార్యాలయాల వద్ద నిర్వహించే ఆందోళనా కార్యక్రమాల్లో రైతాంగం పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. రాష్ట్రంలో రైతాంగ సమస్యల పరిష్కారం కోసం రైతు సంఘాల నాయకులతో ప్రభుత్వం సమావేశం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఈశ్వరయ్య, కేవీవీ ప్రసాద్ మాట్లాడుతూ 2023 నాటికి రైతుల ఆదాయం రెట్టింపు చేస్తామన్న కేంద్ర, రాష్ట్ర పాలకుల వాగ్దానం అమలు కాలేదని విమర్శించారు. రైతులు, కౌలు రైతులకు అవసరమైన రుణాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పీలేరు నియోజకవర్గంలో నష్టపోయిన బొప్పాయి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని, నకిలీ విత్తనాలు అమ్మిన నర్సరీలపై, ఎరువుల దుకాణదారులపై చర్యలు తీసుకోవాలన్నారు. పోలవరం ప్రాజెక్టుతో పాటు ఇతర సాగు, తాగునీటి ప్రాజెక్టులను త్వరిత గతిన పూర్తిచేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆఫీస్ బేరర్స్ జగన్నాథం, రామచంద్రయ్య, కాటమయ్య, రామానాయుడు, మల్లికార్జున, అప్పల నాయుడు, జమలయ్య, ప్రజానాట్య మండలి రాష్ట్ర కార్యదర్శి చిన్నం పెంచలయ్య, సీపీఐ జిల్లా కార్యదర్శి పి.ఎల్.నరసింహులు, సహాయ కార్యదర్శి మహేష్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి వంగిమళ్ల రంగారెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు కృష్ణప్ప, సాంబశివ, సీపీఐ మదనపల్లె నియోజకవర్గ కార్యదర్శి మురళి తదితరులు పాల్గొన్నారు.

4న రెవెన్యూ భూ బాధితుల సమావేశం : ఈశ్వరయ్య

మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయంలో జరిగిన ప్రభుత్వ రికార్డుల కాల్చివేతను నిరసిస్తూ ఆగస్టు 4న రెవెన్యూ భూబాధితులతో సీపీఐ అధ్వర్యంలో సమావేశం నిర్వహించబోతున్నామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జి.ఈశ్వరయ్య తెలిపారు. ఇక్కడ జరిగిన ఒక సమావేశంలో ఆయన మాట్లాడుతూ రెవెన్యూ అధికారులు, భూ కబ్జాదారులు కలిసి వారు చేసిన అవినీతి, అక్రమాలు బయటపడకుండా చూడటం కోసమే ప్రభుత్వ రికార్డులను తగలబెట్టారని అన్నారు. ఈ ఘటన అనంతరం అనేక మంది పేదలు తమ భూములను బలవంతంగా లాక్కున్నారని, మా భూములు మాకు ఇప్పించాలని మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారని, ఆంధ్ర ప్రదేశ్ రెవెన్యూ ప్రధాన కార్యదర్శి సిసోడియాకు ఐదు వందలకు పైగా ఫిర్యాదులు ఇచ్చారని తెలిపారు. బాధితులకు న్యాయం జరిగే వరకూ పోరాటం కొనసాగిస్తామన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామానాయుడు, జిల్లా కార్యదర్శి నరసింహులు, సహాయ కార్యదర్శి మహేష్, కార్యవర్గ సభ్యులు కృష్ణప్ప, సాంబశివ, మనోహర్ రెడ్డి, నియోజకవర్గ కార్యదర్శి మురళి, మాధవ్, రెడ్డి, సూరి, తిరుమల, దేవ, శోభ తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీకి రూ.2,737 కోట్లు: సీఎస్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఎన్టీఆర్ భరోసా ఫించన్ల పంపిణీని గురువారం ఉదయం ఆరు గంటలకే మొదలుపెట్టడంతో పాటు 96శాతం పైగా పూర్తి చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ ఆదేశించారు. ఆగస్టుకు సంబంధించి 64.82 లక్షల ఫించన్ల పంపిణీకి రూ.2,737.41 కోట్లను విడుదల చేశామని చెప్పారు. గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి పింఛన్లు అందజేయాలన్నారు. ఫించన్ల పంపిణీ లో కలెక్టర్లు స్వయంగా పాల్గొనాలని ఆదేశించారు. ఫించన్ల పంపిణీలో జూలైలో పశ్చిమ గోదావరి, కడప, అనంతపురం జిల్లాల్లో జరిగిన సంఘటనలు పునరావృతం కాకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సీఎస్ ఆదేశించారు. ఆ సంఘటనలకు సంబంధించి బాధ్యులపై ఇప్పటికే క్రిమినల్ కేసులు నమోదు చేయడంతో పాటు వారిని విధుల నుంచి సస్పెండ్ చేసినందున తదుపరి క్రమశిక్షణా చర్యలు కూడా తీసుకోవాలని సూచించారు. ఫించన్ల పంపిణీలో అక్రమాలకు పాల్పడే వారిపై కఠినంగా వ్యవహరించాలన్నారు.

అదనపు పనిదినాల పెంపునకు కేంద్రం అంగీకారం: పవన్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: కేంద్ర ప్రభుత్వానికి పంపిన ప్రతిపాదన మేరకు 2024-25 ఆర్థిక సంవత్సరానికి లేబర్ బడ్జెట్‌ను 21.50 కోట్ల పనిదినాలకు పెంచడానికి కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ అంగీకరించిందని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తెలిపారు. పెరిగిన పని దినాల వల్ల ఉపాధి హామీ పనులుచేసే 54 లక్షల కుటుంబాలకు లబ్ధిచేకూరనుందని పేర్కొన్నారు. లేబర్ బడ్జెట్ మొదటి విడతగా 15 కోట్ల పనిదినాలు మంజూరు చేయగా... జూన్ నెలాఖరుకే పూర్తయినందున అదనపు పని దినాల కోసం ప్రభుత్వం తరపున ప్రతిపాదనలు పంపామని వివరించారు. ఢిల్లీలో మంగళవారం కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ కార్యదర్శి అధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఈ ప్రతిపాదనను అంగీకరించారని పవన్ తెలిపారు. ప్రధాని మోదీకి కృతజ్ఞతలు తెలియజేస్తున్నానన్నారు. కూలీల బకాయిల సత్వర విడుదలకు సమ్మతించారని చెప్పారు.

ఇంటర్ విద్యార్థి ఆత్మహత్యపై మంత్రి డోలా విచారం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: శ్రీకాకుళం జిల్లా నందిగాం అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాలలో ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య ఘటనపై రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి విచారం వ్యక్తం చేశారు. ఘటనపై శ్రీకాకుళం జిల్లా కలెక్టర్, ఎస్పీల నుంచి వివరాలు అడిగి తెలుసుకుని, ఘటనపై పూర్తి స్థాయి దర్యాప్తు చేపట్టాలని ఆదేశించారు. మంత్రి మాట్లాడుతూ విద్యార్థిని ఆత్మహత్య ఘటన విచారకరమని, తన మనసును తీవ్రంగా కలిచి వేసిందన్నారు. ఏమైనా సమస్యలు ఉంటే ఉపాధ్యాయుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోలేగానీ, విద్యార్థులు మనోధైర్యాన్ని కోల్పోవద్దని, క్షణికా వేశంలో ప్రాణాలు తీసుకుని బంగారు భవిష్యత్తును పాడు చేసుకోవద్దని సూచించారు. విద్యార్థిని కుటుంబ సభ్యులకు మంత్రి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

బడ్జెట్ ప్రజలపై భారం మోపింది

వెలుగూరి రాధాకృష్ణమూర్తి

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్: విశాఖ నగరంలో సెప్టెంబరు 1, 2, 3 తేదీల్లో జరగనున్న ఏఐటీయూసీ జాతీయ సమ్మేళనాలను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర గౌరవాధ్యక్షులు వెలుగూరి రాధాకృష్ణమూర్తి పిలుపునిచ్చారు. గుంటూరు మల్లయ్యలింగం భవన్‌లోని ఏఐటీయూసీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జాతీయ సమ్మేళనాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాలు మారుతున్నప్పటికీ కార్మికులు, రైతుల సమస్యలు పరిష్కారం కావడం లేదని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్‌లో ప్రజలపై భారాలు మోపుతూ బడా కార్పొరేట్ సంస్థలకు రాయితీలను ప్రకటించిందని మండిపడ్డారు. ఇది ప్రజల ప్రభుత్వం కాదని గుజరాత్ వ్యాపారస్తుల ప్రభుత్వమని ఈ బడ్జెట్‌తో చాలా స్పష్టంగా తెలుస్తోందని అన్నారు. కార్మికులకు శాపంగా మారిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ గుంటూరు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆకిటి అరుణ్ కుమార్, మేడా హనుమంతరావు మాట్లాడుతూ ఏఐటీయూసీ జాతీయ సమ్మేళనాలలో భాగంగా 3వ తేదీన వేలాది మంది కార్మికుల మహాప్రదర్శన, బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. గుంటూరు జిల్లా కార్మికవర్గం పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా కోశాధికారి పుప్పాల సత్యనారాయణ, ఉపాధ్యక్షులు రావుల అంజిబాబు, నాయకులు మంగా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నిబద్ధత గల ఉద్యమనేత ఉపేంద్ర బాబు

ఐజేయూ అధ్యక్షులు శ్రీనివాస్‌రెడ్డి

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్): నిబద్ధతగల జర్నలిస్టు, ఉద్యమనేత దివంగత జి.ఉపేంద్రబాబు అని ఐజేయు అధ్యక్షులు, తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కే శ్రీనివాస్ రెడ్డి నివాళు లర్పించారు. ఇటీవల మృతి చెందిన ఉపేంద్ర బాబు సంస్మరణ సభ బుధవారం విజయవాడ ప్రెస్ క్లబ్‌లో ఏపీయూడబ్ల్యూజే అధ్యక్షులు ఐవీ సుబ్బారావు అధ్యక్షతన జరిగింది. సభలో శ్రీనివాస్‌రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. జర్నలిస్టులు, నాన్ జర్నలిస్టుల ఐక్యతకు ఉపేంద్రబాబు ఎనలేని కృషి చేశారన్నారు. ఏపీయూడబ్ల్యూజే అధ్యక్షుడిగా ఉపేంద్రబాబు, తాను ప్రధాన కార్యదర్శిగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో జర్నలిస్టుల ఉద్యమ నిర్మాణానికి, విస్తరణకు చేసిన కృషిని వివరించారు. ఉపేంద్ర బాబు జర్నలిస్టుల ఉద్యమానికి అందించిన సేవలకు చిరస్మరణీయంగా ఆయన పేరిట ఒక కార్యక్రమానికి రూపకల్పన చేస్తామని శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఐవీ సుబ్బారావు మాట్లాడుతూ... ఆంధ్రజ్యోతిలో తనను ఉద్యోగంలో నియమించింది ఉపేంద్ర బాబు అని గుర్తుచేసుకున్నారు. వారి కుటుంబ సభ్యుల సహకారంతో ఉపేంద్ర బాబు పేరిట ఏటా ఓ కార్యక్రమాన్ని నిర్వహించడానికి రూపకల్పన చేస్తామని వెల్లడించారు. ఉపేంద్ర బాబు సన్నిహితులు, సుదీర్ఘకాలం ఆయనతో కలిసి పనిచేసిన విజయవాడ ప్రెస్ క్లబ్ వ్యవస్థాపక కార్యదర్శి పి.వెంకట్రావు మాట్లాడుతూ ఉపేంద్ర బాబు మృతి తనకు వ్యక్తిగతంగా తీరని లోటన్నారు. ఆయన పుస్తకాల పఠనంపై ఆసక్తి కనపరిచేవారని, మహాభారతాన్ని కూడా ఆయన అధ్యయనం చేశారని వెంకట్రావు పేర్కొన్నారు. ఉపేంద్ర బాబు, పొత్తూరు పుల్లయ్య, వీకేఎం తిలక్, అంబటి ఆంజనేయులు తాను కలిసి విజయవాడలో ఏపీయూడబ్ల్యూజే కార్యాలయం నిర్మాణానికి దాతల నుండి విరాళాలు సేకరించామని గుర్తు చేశారు. ఈ సభలో ఏపీయూడబ్ల్యూజే ప్రధాన కార్యదర్శి చందు జనార్ధన్, ఐజేయు కౌన్సిల్ సభ్యులు ఎస్కే బాబు, ఏపీయూడబ్ల్యూజే విజయవాడ యూనిట్ అధ్యక్షులు చావా రవి, సామ్నా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సి.హెచ్ రమణారెడ్డి, ఉపేంద్ర బాబు కుమారుడు జి.అజయ్ తదితరులు మాట్లాడుతూ ఉపేంద్ర బాబు జర్నలిస్టుల ఉద్యమాలకు చేసిన సేవలను కొనియాడుతూ శ్రద్ధాంజలి ఘటించారు. తొలుత ఏపీయూడబ్ల్యూజే విజయవాడ యూనిట్ కార్యదర్శి దారం వెంకటేశ్వరరావు వక్తలను వేదిక పైకి ఆహ్వానించగా శ్రీనివాస్ రెడ్డి తదితరులు ఉపేంద్ర బాబు చిత్రపటానికి పూలమాల వేసి పుష్పాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో విజయవాడ ప్రెస్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు కె.జయరాజ్, దాసరి నాగరాజు, ఏపీ ఎలక్ట్రానిక్ మీడియా అసోసియేషన్ అధ్యక్షులు ఏచూరి శివ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల ప్రయోజనాలు చెల్లించాలి

ఏపీ (పీటీడీ) ఆర్టీసీ ఈయూ డిమాండ్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఏపీ (పీటీడీ) ఆర్టీసీ ఉద్యోగులకు చెల్లించాల్సిన టీఏ, డీఏతో పాటు ఇతర ప్రయోజనాలను వేతనంతో పాటు చెల్లించాలని ఏపీ పీటీడీ (ఆర్టీసీ) ఎంప్లాయిస్ యూనియన్ డిమాండ్ చేసింది. ఈ మేరకు ట్రెజరరీ సంచాలకులు ఎన్.మోహన్‌రావును బుధవారం యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పలిశెట్టి దామోదరరావు, జీవీ నరసయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ సుబ్రహ్మణ్యం తదితరులు కలిసి వినతి పత్రం అందజేశారు. టీఏ, డీఏ ఇతర అలవెన్సులు చెల్లింపులపై గతంలో రవాణా శాఖ అధికారుల ఉత్తర్వుల ప్రకారం ప్రతి నెలా వేతనంతోనే ప్రయోజనాలను చెల్లించాల్సి ఉందన్నారు. చాలా డిపోల్లో ఈ ఆదేశాలను అమలు చేయడం లేదని, దీనివల్ల ఏపీ పీటీడీ (ఆర్టీసీ) ఉద్యోగులు ఆర్థికంగా నష్టపోతూ, తీవ్ర అసంతృప్తికి గురవుతున్నారని వివరించారు. దీనిపై మోహనరావు స్పందిస్తూ, ఆర్టీసీ ఉద్యోగులకు నైట్‌హాల్ట్‌తో పాటు అన్ని ప్రయోజనాల చెల్లింపునకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

మరోసారి బియ్యం, కందిపప్పు ధరల తగ్గింపు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: నిత్యావసరాల ధరలు ఆకాశాన్నంటుతుండటంతో పేద, మధ్య తరగతి వర్గాలు విలవిల్లాడుతున్నాయి. ఈ నేపథ్యంలో ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. బియ్యం, కందిపప్పు, స్టీమ్డ్ రైస్ ధరలను మరో దఫా తగ్గించాలని నిర్ణయించింది. ఈ మేరకు పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఎక్స్ (ట్విట్టర్) వేదికగా కీలక ప్రకటన చేశారు. బహిరంగ మార్కెట్‌లో కందిపప్పు కిలో రూ.160 ఉండగా, దానిని రూ.150కి తగ్గిస్తున్నామని ప్రకటించారు. బియ్యం రూ.48 నుంచి రూ.47కి స్వల్పంగా తగ్గిస్తున్నట్టు వెల్లడించారు. స్టీమ్డ్ రైస్ రూ.49 నుంచి రూ.48కి తగ్గించడం జరిగిందన్నారు. రైతు బజార్లలో ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేయనున్నామని, గురువారం నుంచి విక్రయిస్తారని మంత్రి వివరించారు. తగిన ఏర్పాట్లు చేయాలని జాయింట్ కలెక్టర్లను ఆదేశించామని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఎన్డీయే ప్రభుత్వం నెల రోజులో బియ్యం, కంది పప్పు ధరలు రెండుసార్లు తగ్గించి ప్రజలకు అందుబాటులోకి తెచ్చిందని ఆయన వెల్లడించారు.

కూలీలకు తక్షణమే బకాయిలు చెల్లించాలి: ఆవుల శేఖర్

విశాలాంధ్ర-పత్తికొండ: ఉపాధి హామీ కూలీలకు పెండింగ్ బకాయిలు తక్షణమే చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్ డిమాండ్ చేశారు. కర్నూలు జిల్లా పత్తికొండలో వ్యవసాయ కూలీలతో కలిసి ఎంపీడీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. తొమ్మిది నెలలుగా వేతనాలు లేక కూలీలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవుల శేఖర్ ఆందోళన వ్యక్తంచేశారు. కూలీలకు పనిముట్లు, మెడికల్ కిట్లు పంపిణీ చేయాలని, 200 పని దినాలు కల్పించాలని, రోజుకి 600 రూపాయల కూలీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. బకాయిలు చెల్లించకపోతే ఆందోళనలు చేస్తామని ఆయన హెచ్చరించారు. ఏపీఓ వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేశారు. వ్యవసాయ కార్మిక సంఘం నియోజకవర్గ అధ్యక్షులు వెంకటరామిరెడ్డి అధ్యక్షతన జరిగిన ధర్నాలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.నబి రసూల్, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు మద్దిలేటి శెట్టి, పట్టణ కార్యదర్శి రామాంజనేయులు, ఏఐటీయూసీ నియోజకవర్గ అధ్యక్షడలు నెట్టికంటయ్య, సీపీఐ పందికోన, కొత్తపల్లి శాఖ కార్యదర్శులు జొహరాపురం కాశి, గిడ్డయ్య గౌడ్, నాయకులు గుండు బాషతో పాటు ఉపాధి హామీ కూలీలు ఉరుకుందు, నరసింహులు, రషీద్, ఆంజనేయులు పాల్గొన్నారు.

పదవీ విరమణ వరకూ చైల్డ్‌కేర్ లీవ్

ఏపీ జేఏసీ అమరావతి విజ్ఞప్తి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: మహిళా ఉద్యోగినులకు ప్రభుత్వం ఇచ్చిన చైల్డ్‌కేర్ లీవ్ ఉత్తర్వులు వారి పదవీ విరమణ వరకు అమలు అయ్యేలా చర్యలు తీసుకోవాలని ఏపీ జేఏసీ అమరావతి విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు వెలగపూడి సచివాలయంలో ఆర్థికశాఖ సంయుక్త కార్యదర్శి అల్లాడి గౌతమ్‌ను జేఏసీ చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, సెక్రటరీ జనరల్ పలిశెట్టి దామోదరరావు, ఏపీ జేఏసీ అమరావతి మహిళా విభాగం రాష్ట్ర చైర్‌పర్సన్ పారే లక్ష్మి, పొన్నూరు విజయలక్ష్మి బుధవారం కలిసి సమస్యలను విన్నవించారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల్లో అధికశాతం మహిళా ఉద్యోగులే పనిచేస్తున్నారని తెలిపారు. గత ప్రభుత్వాల ఆదేశాల ప్రకారం... చైల్డ్ కేర్ లీవును ఆరు నెలలపాటు వారి పిల్లల వయస్సు 18 ఏళ్లు నిండేలోపుగా వినియోగించుకోవచ్చని ఆదేశాలున్నాయని వివరించారు. ఈ నిబంధనలతో అధికశాతం ఉద్యోగినులు ప్రయోజనాలు పొందలేకపోతున్నారని తెలిపారు. మహిళా ఉద్యోగినులు పదవీ విరమణ చేసే లోపు వారి పిల్లల అవసరాల నిమిత్తం ఉపయోగించుకునేలా ఉత్తర్వులు జారీచేయాలని కోరారు. దీనిపై అల్లాడి గౌతమ్ సానుకూలంగా స్పందించారని, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చినట్టు సంఘ నేతలు చెప్పారు.

రవాణాశాఖ అక్రమాలపై సమగ్ర దర్యాప్తు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రవాణాశాఖలో నెలకొన్న అక్రమాలపై సమగ్ర దర్యాప్తు చేపట్టి, అందుకు బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని టీడీపీ నేత, మాజీ ఎమ్మెల్యే జేసీ ప్రభాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు రవాణాశాఖ మంత్రి మండిపల్లి రామ్‌ప్రసాద్‌రెడ్డికి బుధవారం ఆయన ఒక లేఖ రాశారు. రవాణాశాఖలో అక్రమాలకు అంతేలేదని వివరిస్తూ, రవాణాశాఖ ప్రధాన కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ గా మనోజ్ అనే వ్యక్తి ఉద్యోగంలో చేరాడని, అతడు పరీక్ష రాయకుండానే డిగ్రీ ధృవీకరణం సంపాదించి పదోన్నతి పొందారని ఆ లేఖలో ఫిర్యాదు చేశారు. దీనికి అప్పటి అసిస్టెంట్ సెక్రటరీ మణికుమార్, జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ రమాశ్రీ, అడిషనల్ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ ప్రసాద్‌రావు, రవాణా మాజీ కమిషనర్ ఆంజనేయులు అనుంగ శిష్యులు వీరు, ఒకే సామాజిక వర్గానికి చెందిన వారని పేర్కొన్నారు. వారంతా ప్రలోభాలకు అడ్డగోలుగా పదోన్నతులు కల్పించా రన్నారు. గతంలోనే ఈ సమస్యను అధికారులు దృష్టికి తీసుకెళ్లినా స్పందించలేదన్నారు. ఈ ఫిర్యాదుపై ఎలాంటి చర్యలు తీసుకోకుండా కాలయాపన చేస్తుంటే, మంత్రి నారా లోకేశ్ దృష్టి తీసుకెళ్లినట్లు జేసీ గుర్తుచేశారు. ఎక్కడైనా చిన్న అధికారి తప్పు చేస్తే... ఉన్నతాధికారిని విచారణాధికారిగా నియమిస్తారని అన్నారు. ఈ విషయంలో జాయింట్ ట్రాన్స్‌పోర్టు కమిషనర్‌పై కిందిస్థాయి అధికారిని విచారణాధికారిగా నియమించడం అర్థరహితమని తెలిపారు. తక్షణమే అవినీతి వ్యవహారంలో బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పెద్దలకు టీబీ, బీసీజీ టీకాల లక్ష్యాన్ని చేరుకోవాలి

ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ హరికిరణ్



విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: పెద్దలకు టీబీ, బీసీజీ టీకాలు వేయడంలో నిర్దేశించిన లక్ష్యాన్ని చేరుకోవాలని ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ సి.హరికిరణ్ ఆదేశించారు. ఈ టీకాలు వేసినప్పుడు ఆయుష్మాన్ భారత్ హెల్త్ అకౌంట్ గుర్తింపు సంఖ్యను (ఏబీహెచ్ఎ ఐడీ) కూడా ఏఎన్ఎంలు రూపొందించాలన్నారు. మంగళగిరి ఏపీఐఐసీ టవర్స్‌లోని వైద్య ఆరోగ్య శాఖ ప్రధాన కార్యాలయంలో బుధవారం జాతీయ టీబీ నిర్మూలనా కార్యక్రమంపై కమిషనర్ హరికిరణ్ సమీక్షించారు. ఇప్పటి వరకు 17.78 లక్షల మందికి టీబీ, బీసీజీ టీకాలు వేశారని, 50 లక్షల మందికి టీకాలు వేయాలన్న లక్ష్యాన్ని చేరుకునేందుకు మరింతగా కృషి చేయాలని సూచించారు. టీబీ పేషెంట్లకు అదనపు పోషకాహారాన్ని పంపిణీ చేసేందుకు అనేక మంది పారిశ్రామిక వేత్తలను సంప్రదించాలని, జిల్లాల్లో ఆయా జిల్లా పరిశ్రమల అధికారుల సహాయాన్ని తీసుకోవడం ద్వారా మరింత విస్తృతంగా దీన్ని అమలు చేయాలని తెలిపారు. సబ్ సెంటర్లలో కూడా టీబీ శాంపిళ్లను సేకరించాలన్నారు. పరీక్షలు నిర్వహించేందుకు ఇప్పటికే ఉన్న ల్యాబ్‌లతో పాటు ఇంకా అవసరమైన ల్యాబ్‌ల విషయమై ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. టీబీ రోగులకు సరిపడా మందులను అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు. 2025 నాటికి టీబీ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు అన్నివిధాలా కృషి చేయాలన్నారు. టీబీ విభాగంలో ఖాళీ పోస్టుల భర్తీకి ప్రతిపాదనలను సిద్ధం చేయాలన్నారు. గత ఏడాది 84 వేల టీబీ కేసులను గుర్తించగా, ఈ ఏడాది జనవరి నుంచి జూన్ వరకు 43 కేసులను గుర్తించామని రాష్ట్ర టీబీ అధికారి డాక్టర్ టి.రమేష్ ఈ సందర్భంగా వివరించారు. 94 శాతం మంది టీబీ రోగులకు విజయంతంగా చికిత్స అందించి స్వస్థత చేకూర్చామని తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర కన్సల్టెంట్లు, ఐటీ నిపుణులు పాల్గొన్నారు.

96 మంది డీఎస్పీల బదిలీ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం భారీగా డీఎస్పీలను బదిలీ చేసింది. ఎన్డీయే కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత భారీ సంఖ్యలో డీఎస్పీలను బదిలీ చేయడం ఇదే ప్రథమం. ఒకే సారి ఏకంగా 96 మంది డీఎస్పీలను బదిలీ చేసింది. ఈ మేరకు డీజీపీ ద్వారకా తిరుమలరావు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. వీరిలో 57 మంది డీఎస్పీ లను పోలీస్ కేంద్ర కార్యాలయానికి రిపోర్టు చేయాలని ఆదేశించారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఏకపక్షంగా వ్యవహరించారన్న ఆరోపణలు ఉన్న కారణంగానే ఆ డీఎస్పీలకు ఎక్కడా పోస్టింగ్ ఇవ్వకుండా డీజీపీ కార్యాలయానికి రిపోర్టు చేయాలని ఆదేశాలు జారీ చేశారని భావిస్తున్నారు. వివాద రహితంగా పని చేసిన వారిని డీఎస్పీలు, ఇతర విభాగాల అధికారులుగా ప్రభుత్వం నియమించింది. బదిలీ అయిన వారిలో సీఐడీ, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌తో పాటు ఇతర విభాగాల అధికారులు ఉన్నారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
పశుసంవర్ధక శాఖ
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు నోటీసు
AHF02-COOR0EXB/2/2024/2-P&E SEC-DAH, Dt. 31-07-2024
పశుసంవర్ధక శాఖ, ఆంధ్రప్రదేశ్ వారు స్వతంత్ర్య దినోత్సవం-2024 సందర్భముగా శకటము తయారు చేసి ప్రదర్శించడం కొరకు అధీకృత ఏజెన్సీ ఎంపిక కొరకు ఆన్‌లైన్ టెండర్లు కోరబడు చున్నవి. టెండర్ డాక్యుమెంట్ ఆన్‌లైన్‌లో తెరుచు తేది: 01-08-2024, ఉ॥ 11.00గం.లకు, తదుపరి వివరాలకు: https://tenders.apeprocurement.gov.in ఫోన్ : 9441941996.
సం/- సంచాలకులు
DIPR/13799/CL/ADVT-1/1/2021-22 Dt. 31-7-2024

సంపాదకీయం

ఇ.వి.ఎం.లకు అతీతమైన మాయ

దాదాపు రెండు నెలల పాటు ఏడు దశల్లో సార్వత్రిక ఎన్నికలు నిర్వహించి జూన్ నాలుగున ఫలితాలు వెల్లడించిన తరవాత కూడా ఫలితాలపై అనుమానాలు తీరడం లేదు. ఎన్నికలకు ముందు ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు(ఇ.వి.ఎం.) వివాదాస్పదమైనాయి. ఇ.వి.ఎం.ల మీద అనేక ఏళ్ల నుంచి అనేక మంది నిపుణులు అనుమానాలు వ్యక్తం చేస్తూనే ఉన్నారు. వాటిని ఏకపక్షంగా ఒక రాజకీయ పార్టీకి అనుకూలంగా వినియోగించుకునే అవకాశం లేదని ఎన్నికల కమిషన్ చెప్తున్నా జనంలో నెలకొన్న అనుమానాలను నివృత్తి చేయడానికి చేసిందేమీ లేదు. అంటే ఎన్నికల సమయంలో అన్ని పక్షాలకు సమాన అవకాశాలు కల్పించే బాధ్యతను రాజీవ్ కుమార్ నాయకత్వంలోని ఎన్నికల కమిషన్ నిర్వర్తించనే లేదు. ఎన్నికలకన్నా ముందు ఆయన నిర్వహించిన విలేకరుల సమావేశంలో లేవనెత్తిన ప్రశ్నలకు నికరమైన సమాధానాలు ఇవ్వకుండా కవిత్వం చదవడం ప్రారంభించారు. ఆయన కవితాత్మ జనం అనుమానాలను ఏ మాత్రం తీర్చలేకపోయింది. ఓట్ ఫర్ డెమోక్రసీ, అసోసియేషన్ ఫర్ డెమోక్రాటిక్ రైట్స్ ఎన్నికలకు ముందు, ఎన్నికల తరవాత కూడా ప్రశ్నలు లేవనెత్తుతూనే ఉంది. ఇ.వి.ఎం.లు లేకపోతే మోదీ ఎన్నికల్లో విజయం సాధించలేరు అని రాహుల్ గాంధీ అనేక ఎన్నికల ప్రచార సభల్లో ఆరోపించారు. కొత్త పార్లమెంటు ఏర్పడిన తరవాత కూడా సమాజ్ వాదీ పార్టీ నాయకుడు అఖిలేశ్ యాదవ్ నిండు లోకసభలోనే ఎన్నికలకు ముందు, తరవాత కూడా తనకు ఇ.వి.ఎం.ల మీద నమ్మకంలేదని కరాఖండీగా చెప్పారు. ఉత్తరప్రదేశ్ లోని మొత్తం 80 సీట్లు తమ పార్టీనే గెలిచినా తాను ఈ ఓటింగ్ యంత్రాలను నమ్మను అని అఖిలేశ్ యాదవ్ అన్నారు. ఇ.వి.ఎం.ల పని తీరును, వాటిని మార్చడానికి అవకాశం లేదని నిరూపించడానికి ప్రతిపక్షాలు ప్రతిపాదించే నిపుణుల ముందు రుజువు చేయాలని ప్రతిపక్షాలు కోరినా ఎన్నికల కమిషన్ స్పందించలేదు. ఇ.వి.ఎం.ల పై రగడ ఇప్పుడప్పుడే సమసి పోయేట్టు లేదు. కొన్ని చోట్ల పోలైన ఓట్ల కన్నా లెక్కకు వచ్చిన ఓట్లు తక్కువగా ఉంటే మరి కొన్ని చోట్ల పోలైన ఓట్ల కన్నా ఎక్కువ ఓట్లు లెక్కకు వచ్చాయి. అంటే ఎన్నికల ఫలితాలను తారుమారు చేయడానికి అధికార పక్షం పన్నిన కుట్రలకు ఎన్నికల కమిషన్ పూర్తి మద్దతు ఉందనుకోవాలి. యంత్రాలు అబద్ధం ఆడవు అనుకుంటే మరి ఈ లెక్కల్లో తేడా ఎందుకు వచ్చినట్టు. దీని మీద ఎన్నికల కమిషన్ పెదవి విప్పక పోవడంలో ఆంతర్యం ఏమిటి? 176 సీట్లలో పోలైన ఓట్ల కన్నా ఎక్కువ 35,000 ఓట్లు లెక్కలోకి వచ్చాయి. మొత్తం మీద 15 రాష్ట్రాలలోని 79 నియోజక వర్గాలలో ఏదో మాయ జరిగింది. ఈ మాయ జరగడమే నిజమై ఉంటే "ఇండియా" ఐక్యసంఘటనలోని పక్షాలు బీజేపీకన్నా ఎక్కువ సీట్లు సంపాదించేవి అన్న వాదన నిరాధారంగా మిగలదు. ఈ 79 స్థానాలను బీజేపీ సాధించిన 240 సీట్ల నుంచి తీసేస్తే కేవలం 161 సీట్ల దగ్గరే చతికిలపడేది. ఓటు వేయడానికే ఇ.వి.ఎం.లు ఉపకరిస్తాయి కానీ ఆ ఓట్లు నమోదయ్యేది వి.వి.పాట్లలో. ఈ రెండింటి అంకెల మధ్య తేడా ఉందంటే ఎక్కడో మోసం జరుగుతోందనే అనుకోవాలి. ఈ సారి ఇ.వి.ఎం. ల పనితీరుమీద మాత్రమే ఫిర్యాదులు రాలేదు. ఓట్ల లెక్కింపులో ఎన్నికల కమిషన్ మాయ ఇ.వి.ఎం.ల వల్ల జరుగుతుందనుకునే నష్టం కన్నా ఎక్కువ. మొత్తం 538 సీట్లలో పోలైన ఓట్లకు లెక్కించిన ఓట్లకు మధ్య తేడా ఉందని అసోసియేషన్ ఫర్ డెమోక్రాటిక్ రిఫామ్స్ నిరంతరం వాదిస్తోనే ఉంది. 362 సీట్లలో పోలైన ఓట్ల కన్నా లెక్కించిన ఓట్లు 5.5 లక్షలు తక్కువ కావడం పచ్చి మోసమేగా! మరి కొన్ని చోట్ల ఈ పరిస్థితి తిరగబడి పోలైన ఓట్ల కన్నా లెక్కించిన ఓట్లు ఎక్కువైనాయి. సగటున 3000 ఓట్ల తేడా ప్రతి నియోజకవర్గంలోనూ ఉందన్న ఆరోపణలు ఉన్నాయి. లక్షలాది ఓటర్లు ఉండే లోకసభ నియోజక వర్గంలో గెలిచినవారు సాధించిన ఓట్లకు, ఓడిన వారికి వచ్చిన ఓట్ల మధ్య తేడా హాస్యాస్పదంగా ఉంది. ఉదాహరణకు వాయవ్య ముంబై నియోజకవర్గంలో గెలిచిన అభ్యర్థికి కేవలం 48 ఓట్లే ఎక్కువ వచ్చాయి. ఫరూఖాబాద్ లో కూడా సమీప ప్రత్యర్థుల మధ్య తేడా చాలా స్వల్పం.

ఎన్నికల క్రమంలో ప్రతిపక్షాలు ఎన్ని ఫిర్యాదులు చేసినా ఎన్నికల కమిషన్ పట్టించుకోలేదు. సాక్షాత్తు మోదీ మీద ఫిర్యాదుచేస్తే కనీసం ఆయనకు నోటీసు ఇచ్చే ధైర్యం కూడా ఎన్నికల కమిషన్‌కు లేకుండా పోయింది. ఆయన పార్టీకి నోటీసు జారీచేసి చేతులు దులుపుకుంది. అదే ఫిర్యాదు అందిందే తడవుగా ప్రతిపక్ష పార్టీలకు నోటీసులమీద నోటీసులు గుప్పించారు. సాధారణంగా పోలింగ్ సమయం ముగిసిన తరవాత కొద్ది గంటల్లో ఎన్నికల కమిషన్ ఇంత శాతం ఓట్లు పోలయ్యాయని గణాంకాలు విడుదల చేస్తుంది. ఆ మర్నాటికి నికరమైన లెక్కలు ప్రకటిస్తుంది. ఆ తరవాత తేడాలకు ఆస్కారం ఉండకూడదు. కానీ ఈసారి ఏడు దశల పోలింగ్ వివరాలు ప్రకటించడానికి ఎన్నికల కమిషన్ చాలా ఎక్కువ సమయం తీసుకుంది. పైగా ఎన్నికల కమిషన్ వెబ్‌సైట్ నుంచి కొంత సమాచారం తీసేశారు. దీనికి కారణం ఏమిటో ఎన్నికల కమిషన్ చెప్పనే లేదు. పోలింగ్ శాతంలో అంకెలు మారిపోవడం, నికరమైన అంకెల ప్రకటనలో విపరీతమైన జాప్యం, ఒక నియోజకవర్గంలో పోలైన ఓట్లకు, అదే నియోజకవర్గంలోని పోలింగ్ కేంద్రాలలో పోలైన ఓట్లకు మధ్య పొంతన లేకపోవడం ఇంతకు మునుపెన్నడూ వినని విచిత్రమే. ఎన్నికల కమిషన్ ప్రకటించిన తాత్కాలిక అంకెలకు నికరమైన అంకెలకు మధ్య 4.65 కోట్ల ఓట్ల తేడా ఉంటే నమ్మకం ఎలా కుదురుతుంది. ఒరిసాలో 10, మహారాష్ట్రలో 11, పశ్చిమ బెంగాల్ లో 10, ఆంధ్రప్రదేశ్ లో 7, కర్నాటకలో 6, చత్తీస్‌గఢ్‌లో, రాజస్థాన్‌లో అయిదేసి, బీహార్, మధ్యప్రదేశ్, తెలంగాణలో మూడేసి, అస్సాం లో 2, అరుణాచల్ ప్రదేశ్, గుజరాత్, కేరళలో ఒక్కో స్థానంలో తాత్కాలిక అంచనాలకు, నికరమైన లెక్కలకు మధ్య తేడా కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది. ఒరిస్సాలో బీజేపీ విజయానికి, ఆంధ్ర ప్రదేశ్‌లో తెలుగుదేశం, ప్రజారాజ్యం, బీజేపీ కూటమి అమోఘమైన విజయం సాధించడంలో ఎన్నికల కమిషన్ మాయ ఏమైనా ఉందేమోనన్న అనుమానాలు నిరాధారం కాకపోవచ్చు. బీజేపీ కేరళలో ఒక సీటు సంపాదించడంలోనూ మతలబు ఉందేమో! ముగ్గురు ఎన్నికల కమిషనర్ల నియామక కమిటీలోంచి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిని తప్పించడంలోనూ మతలబు ఉండే ఉంటుంది. లేకపోతే అన్ని నియోజక వర్గాలలో 3.2 శాతం నుంచి 6.32 శాతం దాకా ఎక్కువ ఓట్లు ఇ.వి.ఎం.లు పొదగడంవల్ల వచ్చినవి కావుగా. ఒరిశా4లో ఈ తేడా 12.4 శాతం అయితే ఆంధ్రప్రదేశ్‌లో ఇది 12. 54 శాతం అన్నది గమనించి తీరవలసిన అంశమే. మొత్తం మీద మాయ కేవలం ఇ.వి.ఎం.లకు పరిమితమైంది కాదు. అంతకంటే అతీతమైంది.

సద్వినియోగం కాని సేకరణ భూములు

దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లోను ప్రభుత్వాలు పరిశ్రమలు స్థాపించాలని, నీటి ప్రాజెక్టులు కట్టాలని లక్షలాది ఎకరాల పంట పొలాలను, సముద్ర, నదీ తీరప్రాంతాలను సేకరిస్తూ అక్కడి భూ హక్కుదారులకు, తాత్కాలిక పట్టాలతో ఏళ్ళతరబడి నివాసముంటున్న వాళ్ళకు పునరావాస ప్యాకేజీలు లేదా, పర్మినెంటు స్థలాలు ఇస్తామంటు మభ్యపెట్టి దశాబ్దాలుగా సాగదీస్తూ వారికి చెల్లింపులు జరగకుండా తరాలు మారిపోతున్నాయి. ఎంతోకొంత ఆర్థిక వెసులుబాటు కలుగుతుందని, ప్రాజెక్ట్‌తో పదిమందికి మేలు జరుగుతుందనే సదుద్దేశంతో పాటు, ఇవ్వకపోయినా ప్రభుత్వాలు బలవంతంగా లాక్కుంటాయనే భయంతో కూడా రైతులు, ప్రజలు భూములిస్తున్నారు. ఉమ్మడి రాష్ట్రంలో నిర్మితమైన నాగార్జునసాగర్ ప్రాజెక్టు, విశాఖ ఉక్కుఫ్యాక్టరీ, ఎయిర్ పోర్టులు, ఓడ రేవుల నిర్మాణ సమయంలో మొదలైన భూసేకరణతో నాటి పాలకుల చిత్తశుద్ధివల్ల ప్రాజెక్టుల నిర్మాణం త్వరితగతినజరిగి అనేక వేలమందికి ఉపాధి కలగడంతో అందరూ సంతోషపడ్డారు. పరిశ్రమల స్థాపనలో ఆనాటి పాలకుల చిత్తశుద్ధి ముందు ఏ రాజకీయ సమస్య పెద్దది కాకుండా అన్నీ పరిష్కరించుకునే విధంగా వడిగా అడుగులేశారు.

ప్రభుత్వ భూములే కాకుండా ప్రైవేటు వ్యక్తుల వద్దనుండి కూడా భూసేకరణ తప్పనిసరియైనా ఆ నిర్మాణాలు పూర్తయ్యే విషయంలో రాజకీయాలకు నాటి పాలకులు తావివ్వలేదు. నేడు పాలకులెవరైనా ప్రాజెక్టులకు జాతీయస్థాయిలో కేంద్రం కేటాయించాల్సిన నిధులు కానీ, రాష్ట్రాలు భరించాల్సిన ఖర్చుగాని రాజయకీయ స్వార్థపు లెక్కల తక్కెడలో పైకి కిందికి ఊగుతూ నిర్మాణాలన్నీ త్రిశంకు స్వర్గంలో వేలాడుతున్నాయి. ఒక ప్రాజెక్ట్ లేదా పరిశ్రమ నిర్మించాలంటే ఆ ప్రాంత ప్రజల అభిప్రాయ సేకరణకు ప్రాధాన్యమివ్వాలి. సగంమందికి పైగా వ్యతిరేకించినా లెక్కచేయకుండా పదిమంది అధికారుల కమిటీలతో మమ అనిపించి సమస్యలను కోర్టుల కెక్కించి ఏళ్ళతరబడి సాగదీస్తూ అటు యజమానికిగాని, ఇటు ప్రభుత్వానికిగాని ఏ మేలు జరగకుండా దశాబ్దాల కాలహరణం జరుగుతోంది. కేంద్ర ప్రభుత్వం, పర్యావరణశాఖలవంటి వాటి అనుమతులకు ఏళ్ళు గడుస్తాయి. పోలవరం లాంటి జాతీయ ప్రాజెక్టు కట్టాల్సిన బాధ్యత ఒకరిది, పర్యవేక్షించేది మరొకరు. నిజాలకు పాతరవేసే నేటికాలంలో ఎవరి అలసత్వమో తెలియదు కాని దశాబ్దాలు దొర్లి ఖర్చులు రెండింతలుగా పెరుగాతాయి. వీటికి తోడు కొరవడిన పర్యవేక్షణతో నాణ్యతలేని నిర్మాణాలు మన డయాఫ్రమ్ వాల్‌లా ప్రజాధనం కాలప్రవాహంలో కొట్టుకుపోతుంది.

అమరావతిలో రాజధాని నిర్మాణమంటూ నిరంతరం మూడు పంటలు పండే యాభైవేల ఎకరాల భూమిని సేకరించి రాజధాని నిర్మించకుండా పాడుబెట్టి గత పది సంవత్సరాలుగా రెండు ప్రభుత్వాల ఆడిన రాజకీయ క్రీడను 20-20 క్రికెట్ మ్యాచ్‌లా వీక్షించాం. కానీ అక్కడి రైతులు పడ్డ మానసిక వ్యథతోపాటు, పది సంవత్సరాలకాలం అక్కడి పొలాల్లో పంటలువేసే అవకాశం లేక బీడుగా ఉంచడంతో రాష్ట్రానికి పంట నష్టమే కాకుండా రైతులకు కోట్లాది రూపాయల కౌలు చెల్లింపుల పొడిగింపుద్వారా ప్రభుత్వ ఖజానాకు వాటిల్లిన నష్టాన్ని ఈ రాష్ట్ర ప్రజలు తలాకొంచెం తలకెత్తు కోవాల్సిందే. తెలంగాణాలో కాళేశ్వరం మొదలు చాలా రాష్ట్రాల్లో ఇదే పరిస్థితి. తాజాగా రాజధాని నిర్మాణానికి నిధులను కేంద్రం గ్రాంటుగా ఇవ్వకుండా కేవలం అప్పుగా 15వేల కోట్లు 30 సంవత్సరాల తర్వాత చెల్లించే రుణసౌకర్యం కల్పించి గొప్పలు చెప్పుకుంటోంది. దానికి వడ్డీ భారం 30ఏళ్ళపాటుమోసి ఈ రాష్ట్రం నడ్డి విరుగుతుంది. మధ్యలో ప్రభుత్వాలు మారితే నవనగర నిర్మాణమేమోకాని ప్రజల నవనాడులు కుంగుతాయి. ఇది మరో పోలవరంలా దశాబ్దాల చరిత్రగా పుస్తకాలకెక్కుతుంది. రాష్ట్రాభివృద్ధి కోసం, ప్రజల మేలుకోసం అంటూ కట్టే ఏ నిర్మాణాలతోనైనా అంతిమంగా మళ్ళీ ప్రజలే ఆర్థికంగా నష్టపోతున్నారు.

పరిశ్రమలకే కాకుండా టూరిజం అభివృద్ధిపేరిట, పార్కులు, అధునాతన ప్రభుత్వ కార్యాలయాలు నిర్మాణాలకు కూడా ఎన్నో భూములను, కొండలను సైతం ఉపయోగించడం వల్ల పర్యావరణం దెబ్బతిని ప్రజలు అనేక రకాలైన అనారోగ్యాలకు గురవుతున్నారు. పరిశ్రమలు కడితే అవి సృష్టించే వ్యర్థాల గురించి, నిర్మాణాల నాణ్యత గురించి, పర్యావరణాన్ని గురించి పర్యవేక్షణ కమిటీలు చేసిన సూచనలను ప్రభుత్వాలు పట్టించుకోవు. తీర ప్రాంతాల దురాక్రమణలను అరికట్టడంలో అలసత్వం, అవినీతి రాజకీయాలతో దేశం, రాష్ట్రంలోని ఏ ప్రాజెక్టుల నిర్మాణానికైనా యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టని నాయకులున్నంతకాలం శుష్క వాగ్దానాలు, శూన్య హస్తాలే గతి!

జోస్యుల వేణుగోపాల్
సెల్: 9440436806

నేర చట్టాలు రాజ్యాంగ స్ఫూర్తికే విరుద్ధం

మాడభూషి శ్రీధర్

భారతీయ జనతా పార్టీ (బీజేపీ) నేతృత్వంలోని నేషనల్ డెమొక్రటిక్ అలయన్స్(ఎన్.డి.ఎ.) మూడోసారి అధికారం చేపట్టాక నూతన నేర చట్టాలను అమలులోకి తెచ్చింది. ఈ నేర చట్టాలు రాజ్యాంగంలో పొందుపరిచిన పౌర, ప్రాథమిక హక్కులను ఉల్లంఘిస్తున్నాయి. ఈ పరిణామాలను చూస్తే భారత రాజ్యాంగానికి ముప్పు పెరిగిందనే విషయం స్పష్టంగా కనిపిస్తున్నది. కొత్త నేరచట్టాల్లో అరెస్టు, కస్టడీ తదితర అంశాలను పరిశీలనచేసే పోలీసులకు విస్తృతమైన అధికారాలు కట్టబెట్టారు. ఇవి ప్రజల ప్రాథమిక హక్కులకు తీవ్ర విఘాతం కలిగించేవిగా ఉన్నాయి. ఇక్కడ పోలీసులకు అధికారాలు పెరగడం అంటే అధికార పార్టీకి చెందిన రాజకీయ నేతల ఆగడాలను పెంచినట్టే అవుతుందనే మరోకోణం కూడా ఉంది.

ఈ నేపథ్యంలోనే ఈ నూతన నేరచట్టాల్లో తిరోగమన నిబంధనలు ఉన్నాయని చాలా మంది అభిప్రాయపడుతున్నారు. ఈ మొత్తం వ్యవహారంలో భారతీయ న్యాయ సంహిత (బి.ఎన్.ఎస్.) నేరాలను నిర్వచించి అందుకు శిక్షలను నిర్దేశిస్తుంది. నేరాలకు పాల్పడినవారు, బాధితులకు రక్షణతోపాటు కేసుల సత్వర విచారణకు సంబంధించిన నిబంధనలు భారతీయ న్యాయసంహితలో ఉన్నాయి. ఇవన్ని పెద్ద సమస్యలుగానే కనిపిస్తున్నాయి. భారతీయ న్యాయ సంహిత (బి.ఎన్.ఏ.), భారతీయ నాగరిక్ సురక్ష సంహిత (బి.ఎన్.ఎస్.ఎస్), భారతీయ సాక్ష్యా అధినియం (బి.ఎస్.ఏ) అనేవి గతంలో నుండి వస్తున్న ఇండియన్ పీనల్ కోడ్-1860, క్రిమినల్ ప్రొసీజర్ కోడ్-1973, ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్-1872ల స్థానంలో తాజాగా వచ్చి చేరాయి. సిఆర్పీసీతో భారతీయ న్యాయసంహితను పోల్చి పరిశీలిస్తే బాధితులను రక్షించడం, కేసు సత్వర విచారణ పేరుతో నిందితులు, నేరం లేదా ఘటనకు సంబంధం ఉన్నట్టు అనుమానిస్తున్న వ్యక్తుల ప్రాథమిక హక్కులన్నీ ఉల్లంఘనకు గురవుతున్నాయి.

నూతన చట్టాల్లోని భారతీయ నాగరిక్ సురక్ష సంహిత (బి.ఎన్.ఎస్.ఎస్)అనేది కేసు విచారణకు సంబంధించిన విధానాలతో రూపొందించారు. ఇందులో సాక్షుల రక్షణ, కేసుల సత్వర పరిష్కారానికి సంబంధించిన నిబంధనలు ఉన్నాయి. మరొక ముఖ్యమైన చట్టం భారతీయ సాక్ష్యా అధినియం-2023. ఇది నేర విచారణలో సాక్ష్యాధారాల ఆమోదానికి సంబంధించినదిగా ఉంది. ఇవన్నీ నేరచట్టంలోని ప్రాథమిక సూత్రాలను ఉల్లంఘిస్తున్నాయి. ఈ పరిస్థితి కారణంగానే ఈ మూడు చట్టాలు బిల్లులుగా ఉన్న తరుణంలోనే హోం వ్యవహారాలశాఖ నుంచి పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీకి సిఫార్సు చేశారు. అయితే ఇది కేవలం కంటి తుడుపు చర్యగానే మిగిలింది. కాబట్టే సదరు కమిటీ మూడు బిల్లులపై తన నివేదికను మూడు నెలల్లోనే (నవంబర్ 10, 2023న) పార్లమెంటుకు సమర్పించింది.

ఒక కేసును 24 గంటల్లోపు దర్యాప్తు పూర్తి చేయలేని పక్షంలో నిందితులను 15 రోజుల వరకు పోలీసు కస్టడీకి ఇచ్చే అధికారం కొత్త చట్టాల కారణంగా న్యాయమూర్తులకు లభిస్తున్నది. ఇది చిన్న విషయం కాదు. పోలీస్ కస్టడిలో ఒకరోజు అంటేనే ఎదురయ్యే అనేక రకాల సమస్యలను, ఘోరాలను మనం చూస్తున్నాం. ఆ స్థానంలో 15 రోజులు అంటే అది ఎంత మాత్రమూ తక్కువ సమయం కాదు. ఆ సమయంలో ఇంకేదైనా జరిగే ప్రమాదాలు లేకపోలేదు. సాధారణంగానే పోలీసులకు కేసుల దర్యాప్తునకు సమయం ఉండదు. రాజకీయ ఒత్తిడుల కారణంగా దర్యాప్తు మరింత ఆలస్యం అవుతున్న దాఖలాలే అధికంగా కనిపిస్తున్నాయి. ఈ పరిస్థితిలో నూతన నేరచట్టాల ప్రకారం పోలీసు కస్టడీలో రూపంలోనే శిక్షా కాలం పెరుగుతుంది. కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఐపిసి ప్రకారం రిమాండు 15 రోజులు ఉంటుందని చెప్పారు. బి.ఎన్.ఎస్.లోనూ అదే ఉందని పేర్కొన్నారు. ఇంతకుముందు ఒక నిందితుడిని పోలీసు రిమాండ్‌కు పంపిన తరువాత 15 రోజులపాటు ఆసుపత్రిలో చేరినట్లయితే అతని రిమాండ్‌కాలం ముగిసేది. కానీ తాజా చట్టాల్లో మరో 15 రోజులు రిమాండ్ ఉంటుంది. ఈ కాలం 60 రోజుల గరిష్ట రిమాండు పరిమితిలో భాగమని ఆయన చెప్పారు. కనీసం 10 సంవత్సరాల జైలుశిక్ష పడే నేరానికి, 40 రోజుల జైలుశిక్ష విధించే నేరానికి కూడా 15 రోజుల పోలీసు కస్టడీతోపాటు దాన్ని 60 రోజులపాటు విస్తరించే అవకాశం ఉన్నది. ఇక్కడే పోలీసులు మరింత శక్తిమంతంగా మారే ప్రమాదం ఉన్నది. ఇవి అదనపు న్యాయపరమైన చిక్కులకు దారితీస్తుంది. సంస్కరణల పేరుతో సాగుతున్న ఈ చట్టాల్లో నేరం చేసినట్టు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఒక అనుమానితుడికి జ్యుడీషియల్ కస్టడీ విధించిన తర్వాత కూడా పోలీసు కస్టడీకి అవకాశం ఏర్పడుతున్నది. గతంలో ఆ అవకాశం ఉండేది కాదు. తాజా చట్టాల్లో ఆ నిబంధనలు తొలగించడంతో పోలీసుల కోరిక మేరకు న్యాయమూర్తి 15 రోజుల అనంతరం జ్యుడీషియల్ కస్టడీ నుండి పోలీసు కస్టడీకి అప్పగించే అవకాశం లభిస్తున్నది. ఈ చట్టాల కారణంగా పోలీసులు చాలా శక్తిమంతులుగా మారతారు. ఇది నేర ఆరోపణలు ఎదుర్కొంటున్న అనుమానితులకు పెను ప్రమాదంగా మారుతుంది. వారు పోలీసుల బెదిరింపులకు, హింసకు గురికావచ్చు. పోలీసు కస్టడీ నియమాల్లో జరిగిన ఈ మార్పులపై పౌరహక్కుల నేతలు, న్యాయవాదులు తీవ్రంగా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఢిల్లీలోని ఒక వ్యాపారిపై బి.ఎన్.ఎస్. కింద తొలికేసు నమోదైంది అని జరుగుతున్న ప్రచారం నిజం కాదు. అంతకు మునుపే మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్‌లో మోటార్‌సైకిల్ దొంగతనానికి సంబంధించిన విషయంలోనే తొలికేసు నమోదైంది. అయితే నూతన నేర కొత్తచట్టం అసలు స్వరూపం ఢిల్లీ కేసు ద్వారా వెలుగులోకి తెచ్చింది. నూతన నేరచట్టాలపై లోక్‌సభలో తొమ్మిది గంటల 29 నిమిషాలు, రాజ్యసభలో ఆరు గంటల 17 నిమిషాలపాటు చర్చ జరిగిందని హోంమంత్రి అమిత్ షా తెలిపారు. 2020లోనే ఎంపీలు, అన్ని రాష్ట్రాల సిఎంలు, సుప్రీంకోర్టు, హైకోర్టు న్యాయమూర్తులు, ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల నుంచి కూడా సూచనలు కోరామని అయన చెప్పుకొచ్చారు. ఈ బిల్లులను సిద్ధంచేయడం కోసం తాను ఏకంగా 158 సంప్రదింపుల సమావేశాలకు హాజరయ్యానని పేర్కొన్నారు. అనంతరం ఆ బిల్లు హోం మంత్రిత్వ శాఖ కమిటీకి పంపారు. నాలుగు రాజకీయ పార్టీలు సహా మిగతా అన్ని పార్టీలు మూడు నెలలపాటు చర్చ జరిపాయి. నేర చట్టాలలో సంస్కరణల కోసం చాలా సూచనలు వచ్చాయి. అవి కూడా బిల్లులో పొందుపరచడమైంది. కాబట్టి కొత్త నేర చట్టాలపై రాజకీయరంగు వేయడం మంచిది కాదని చెప్పుకొచ్చినా నూతన నేర చట్టాలు రాజ్యాంగ సూత్రాలను, నిబంధనలను ఉల్లంఘిస్తున్నాయి. పౌరుల ప్రాథమిక హక్కులకు ప్రమాదకరంగా రూపొందాయి. భారత దేశంలోని న్యాయశాస్త్రాన్ని తీవ్రంగా దెబ్బతీశాయి. ఈ చట్టాలు రాజ్యాంగ స్ఫూర్తికే విరుద్ధం.

ఆంగ్లమూలం : మాడభూషి శ్రీధర్
అనువాదం : డా. క్షేత్రపాల్ రెడ్డి

నింగినంటిన ధరలు నేలకు దిగిరావా?

టి.వి.సుబ్బయ్య

గత దశాబ్దికాలంగా నిత్య జీవితంలో వాడుకునే వస్తువులు, శిలాజ ఇంధనాలు- పెట్రోలు, డీజిలు తదితరాల ధరల భారం ప్రధాని నరేంద్రమోదీ పాలనలో పెరుగుతూనే ఉందిగానీ తగ్గడం లేదు. సామాన్య ప్రజలు ఓట్లు వేయడానికే ఉన్నారనేది పాలకులు భావన. సామాన్యులు రోజువారీ పని చేసుకుంటూ కష్టాలతో జీవనం సాగిస్తున్నారు. ఆహారపదార్థాలు- గోధుమ, వరి, పప్పుధాన్యాల ధరలు తగ్గడంలేదు. ధాన్యాల ఉత్పత్తి అవసరం ఉన్న దానికంటే మిగులుగా పండుతున్నప్పటికీ ఆహారధాన్యాల ధరలు ఎందుకు పెరుగుతున్నా యనేది రహస్యం. వ్యవసాయం సంక్షోభంలో ఉంది. ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. దేశ ప్రజలకు అవసరమైన పంటలు మిగులుగా పండించడంతో ప్రభుత్వం నిల్వచేయడానికి అవసరమైన దానికంటే ఎక్కువగానే సేకరిస్తున్నదని వ్యవసాయశాఖ గణాంకాలు చెప్తున్నాయి. 2023 జూన్‌లో అధిక ధాన్యం సేకరించినట్టుగా వ్యవసాయశాఖ ప్రకటించింది. ఈ ఏడాది గోధుమ ఉత్పత్తి 112.9 మిలియన్ టన్నులు ఉంటుందని అంచనా వేసింది. అనుగుణంగానే రికార్డు స్థాయిలో రైతులు పండించారు. అయినప్పటికీ గోధుమ ధర ఎందుకు పెరుగుతుంది? మరోపక్క ద్రవ్యోల్బణం పెరుగుతూనేఉంది. ద్రవ్యోల్బణం తగ్గించడానికి కృషి చేస్తున్నామని రిజర్వు బ్యాంకు ప్రకటిస్తూనే ఉంది. 2023-24 లో వ్యవసాయరంగం జీడీపీలో వృద్ధి మొత్తం విలువ (జీవిఏ) 1.4 శాతం ఉందని, మొత్తం ఆర్థికరంగం జివిఎ 7.2 శాతం ఉందని ప్రభుత్వం చెప్తోంది. టోకు ధరల సూచి, ధాన్యాల ద్రవ్యోల్బణం 2024 లో 8.7 శాతం ఉండవచ్చునని ప్రభుత్వ అంచనా. అయితే అసలు ప్రభుత్వం వాస్తవ గణాంకాలు చెప్తుందా అనే సందేశం వెలిబుచ్చుతున్నారు.

ఈ సంవత్సరం ఎండలు భగభగమని మండిపోయాయి. దీనితో ఖరీఫ్ పంటలు వేయడం ఆలస్యమైంది. సీజన్ ప్రారంభంలో వర్షాలు తక్కువగా ఉండి రిజర్వాయర్లలో నీటిని నిల్వలు తక్కువగా ఉన్నాయి. ఆహారధాన్యాల ద్రవ్యోల్బణం 10.5 శాతానికి పెరిగింది. ఇప్పుడు వేసిన విత్తనం పంటగా మారి కోతలకు రావడానికి మరో

మూడు నెలలు పడుతుంది. మార్కెట్లకు చేరడానికి ఆపైన కనీసం 15 రోజులు పడుతుంది. ప్రస్తుతానికి ప్రధానమైన పంటలు నిజంగా మిగులుగా వున్నాయాలేక లోటుగా వున్నాయా అనేది పరిశీలించాలి. ఆహార భద్రతా చట్టం కింద ప్రజలకు అవసర కాలంలో విడుదల చేయడంకోసం 590 లక్షల టన్నులు ప్రభుత్వం కేటాయించింది. ఇతర పథకాల కోసం కేటాయించిన ధాన్యాన్ని వినియోగిస్తుంది ప్రభుత్వం. ఇందులో 184.1 లక్షల టన్నులు గోధుమలు, బియ్యం 419 లక్షల టన్నులు. ఇందులో గోధుమ పంట పరిమాణం తక్కువ అని, లోటు ఉంటుందని అంచనా. ముఖ్యంగా పప్పుధాన్యాలు, తృణ ధాన్యాల ఉత్పత్తి గడచిన పదేళ్లకాలంలో ఏనాడు స్వయం సమృద్ధిని సాధించలేదు. పైకి చెప్పేది ఒకటి చేసేది మరొకటి. ఈసారి బడ్జెట్‌లోను ఆహారధాన్యాల ఉత్పత్తిని పెంచుతామని హామీనిచ్చారు. అయితే ధరలు తగ్గిస్తామని చెప్పలేదు. ఈ విషయంపై పార్లమెంటులో చర్చలు జరగలేదు. ఇదొక పెద్ద సమస్యగా కూడా కేంద్రప్రభుత్వం గుర్తించనేలేదు.

బడ్జెట్‌లో వెండి, బంగారం, ప్లాటినం లాంటి వాటి ధరలు తగ్గుతాయని గొప్పగా చెప్పారు. పేదలకు, అణగారిన ప్రజలకు వీటి ధరతగ్గినా, పెరిగినా పెద్దగా పట్టించుకోరు. మరోపక్క అన్ని రకాల పంటల ఉత్పత్తి పెరిగాయని ప్రభుత్వం చెప్తున్నప్పటికీ వీటి ధరలు నిత్యం పెరుగుతూనే ఉన్నాయి. సామాన్యుడికి ధాన్యం ధరలు, చదువులు అందుబాటులో లేనంతగా పెరిగాయి. ఫీజులు, పుస్తకాలు కొనుగోలు తడిసి మోపెడవుతున్నాయి. అనారోగ్యాలకు వైద్య చికిత్స వ్యయం ప్రైవేటు ఆస్పత్రులలో అపారంగా పెరిగాయి. కరోనా మహమ్మారి విజృంభించిన తరుణంలో ప్రతిరోజు వేలాదిమంది ప్రాణాలు హరీమంటున్నా, వైద్య చికిత్సల విషయంలో ప్రధాని మోదీ ఈ వైరస్‌ను 21 రోజుల్లో అదుపులోకి తీసుకువస్తానని ప్రకటించారు. దీపాలు వెలిగించాలని, తాళాలు మోగించాలని దేశ ప్రజలను కోరగా వారు అనుసరించారు. మోదీ చెప్పిన మాటలు నెరవేరలేదు. ఆహారధాన్యాల రేట్లు అపారంగా పెరిగి రెండు పూటలు కూడా సంతృప్తిగా తినలేని పరిస్థితి ఏర్పడింది. నిరుద్యోగం పెరగడంతో కోట్లాది కుటుంబాలు అనేక కష్టాలకు గురవుతున్నారు. కుబేరుల సంఖ్య ఏడాదికేడాది పెరిగిపోతోంది. వీరిపై కనీసం 2 శాతం పన్ను అదనంగా విధిస్తే అణగారిన ప్రజలకు అన్ని సౌకర్యాలు కల్పించి పేదరికాన్ని తగ్గించేందుకు అవకాశం ఉంటుందని ఆర్థిక నిపుణులు సలహాలు ఇచ్చినా మోదీ పట్టించుకోలేదు.

రెండేళ్ల క్రితం కేజీ కందిపప్పు చిల్లర ధర 60 రూపాయలుండగా, ఇప్పుడు రూ. 200 పైగా పలుకుతోంది. ఇతర అన్ని వస్తువుల ధర ఇలాగే పెరగడంవల్ల కోట్లాది కుటుంబాల జీవనవ్యయం రెట్టింపునకు పైగా అయింది. ఆర్థిక అసమానతలు పెరిగిపోతున్నాయి. మన ఎగుమతులు తగ్గిపోయి, దిగుమతులు పెరిగిపోతున్నాయి. 2024 లోక్‌సభ ఎన్నికల్లో రైతులు, నిరుద్యోగులు బీజేపీకి తగిన గుణపాఠం చెప్పారు. పెద్దగా ఆలోచించకుండా మోదీ వేసే ఎత్తులను, వ్యూహాలు నమ్మి ఓట్లేసినందువల్లనే బీజేపీ ఒక్కటే 370, ఎన్‌డిఎ 400 సీట్లు గెలుస్తాయని తప్పెటకొట్టినా, అబద్ధాలు ప్రచారంచేసి నమ్మించాలని చూసినా బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు చేయలేకపోయింది. ఈ నేపథ్యంలో అన్ని పార్టీలతో కలిసి నడుస్తామని, రాష్ట్రాల సహాయంతో దేశాన్ని ఆర్థికంగా మూడవ స్థానం స్థాయికి తీసుకువస్తామని పదేపదే ప్రచారం చేస్తున్నారు. పార్లమెంటులోను, వెలుపల ప్రభుత్వాన్ని ప్రశ్నించడానికి ప్రతిపక్షం బలంగా ఉన్నదని సంతృప్తిపడడమేగాని, మోదీ పాత విధానాలు విడవలేదు. మనువాద విధానాలు అమలుచేసి హిందూ రాష్ట్ర ఏర్పాటుకు ఆర్‌ఎస్‌ఎస్‌కు పాలనలో భాగస్వామ్యం కల్పించడం తీవ్ర ప్రమాదం కలిగే అంశం. భవిష్యత్ ఈ దేశాన్ని ఎంతో ప్రమాదకరమైన దిశగా నడిపించవచ్చునన్న ఆందోళన వ్యక్తమవుతోంది.

జనగణనపై కేంద్రం దాటవేత

సోనియాగాంధీ విమర్శ

న్యూఢిల్లీ: దేశంలో జనగణన అంశాన్ని మోదీ సర్కారు పట్టించుకోవడం లేదని కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియాగాంధీ విమర్శించారు. దేశంలో జనాభా లెక్కింపు ప్రక్రియ 2021లో జరగాల్సి ఉందని, జనగణన చేపట్టాలన్న ఉద్దేశమే కేంద్ర ప్రభుత్వానికి లేదని నిందించారు. జనాభాలెక్కల సేకరణలో కేంద్ర ప్రభుత్వం వైఫల్యంతో దేశంలో స్పష్టమైన జనాభా ఎంతో తెలియకుండా పోతుందన్నారు. దీనితో పాటు జాతీయ ఆహార భద్రతా చట్టం కింద 12 కోట్ల మంది, ముఖ్యంగా షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల వారు ఎలాంటి ప్రయోజనాలకు నోచుకోవడం లేదని అన్నారు. న్యూఢిల్లీలో బుధవారం జరిగిన కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ సమావేశంలో సోనియాగాంధీ మాట్లాడుతూ 2021లో జనాభాలెక్కల సేకరణ జరగాల్సి ఉన్నప్పటికీ అలాంటి ఉద్దేశం ప్రభుత్వానికి లేదని చాలా స్పష్టంగా తెలుస్తోందన్నారు. తద్వారా దేశ జనాభా ఎంతనేది తెలియకుండా పోతుందని, దీనివల్ల జాతీయ ఆహార భద్రతా చట్టం-2013 కింద ఎస్సీ, ఎస్టీలు సహా 12 కోట్ల మందికి ఎలాంటి లబ్ధి చేకూరదన్నారు. వయనాడ్ విలయంలో ప్రాణాలు కోల్పోయిన బాధితుల కుటుంబాలకు సోనియాగాంధీ సంతాపం తెలిపారు. ఇది హృదయ విదారక ఘటన అని, ఆ రాష్ట్రంలోని మన మిత్రులంతా బాధితులకు సాయం అందిస్తున్నారని చెప్పారు. దేశంలోని ఇతర ప్రాంతాల్లోనూ వరద బాధితులకు సానుభూతి తెలిపారు. ప్రకృతి వైపరీత్యాలతో పాటు నిర్వహణాలోపాలతో వరుస రైలు ప్రమాదాల్లో అనేక మంది మృత్యువాత పడుతున్నారని, బాధిత కుటుంబాల పరిస్థితి తమను కలిచివేస్తోందని అన్నారు.

బడ్జెట్‌లో రైతులు, యువతను విస్మరించారు

కేంద్ర బడ్జెట్‌లో రైతులు, యువత డిమాండ్లను పట్టించుకోలేదని, అనేక కీలక రంగాలకు కేటాయింపుల్లో న్యాయం జరగలేదని సోనియాగాంధీ అన్నారు. నిరుద్యోగిత, ద్రవ్యోల్బణంతో కోట్లాదిమంది అతలాకుతలమవుతున్నారని, వాటి విషయం బడ్జెట్‌లో పట్టించుకోలేదని విమర్శించారు. జాతీయ భద్రత, జమ్మూకశ్మీర్‌లో ఉగ్రదాడులను ప్రస్తావిస్తూ... ఉగ్రదాడుల్లో పెద్ద సంఖ్యలో భద్రతా సిబ్బంది, పౌరులు ప్రాణాలు కోల్పోతున్నారని, ఇందుకు భిన్నంగా జమ్మూకశ్మీర్‌లో అంతా బాగుందంటూ మోదీ ప్రభుత్వం చెప్పుకొంటోందని సోనియా అన్నారు. కొద్ది వారాలుగా ఒక్క జమ్మూ ప్రాంతంలోనే 11 ఉగ్రదాడి ఘటనలు జరిగాయన్నారు. మణిపూర్ పరిస్థితులు సైతం మెరుగుపడలేదని చెప్పారు. ప్రధాని ప్రపంచం మొత్తం తిరుగుతున్నా...మణిపూర్ వెళ్లేందుకు, సాధారణ పరిస్థితి నెలకొల్పేందుకు మాత్రం ఇష్టపడటం లేదని విమర్శించారు. కాగా, కొద్ది నెలల్లో నాలుగు రాష్ట్రాలకు ఎన్నికలు జరగనున్నాయని, లోక్‌సభ ఎన్నికల్లో చేకూరిన బలం, సాధించిన విజయాల ప్రేరణతో మనమంతా ముందుకు వెళ్లాలని సోనియాగాంధీ పార్లమెంటరీ పార్టీ సమావేశంలో దిశానిర్దేశం చేశారు. మితిమీరిన ఆత్మవిశ్వాసం ఉండకూడదని అన్నారు. పార్టీ పనితీరు బాగుంటే అసెంబ్లీ ఎన్నికల్లో కచ్చితంగా గెలిచి తీరతామని చెప్పారు. జాతీయ రాజకీయాల్లో మార్పు సాధ్యమవుతుందని ధీమా వ్యక్తం చేశారు

కోచింగ్ సెంటర్ల నియంత్రణకు కొత్త చట్టాలు: అతిశీ

న్యూఢిల్లీ: కోచింగ్ సెంటర్ల నియంత్రణకు కొత్త చట్టాలను రూపొందించాలని ఢిల్లీ ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా ఒక కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు రెవెన్యూ శాఖ మంత్రి అతిశీ పేర్కొన్నారు. ఈ కమిటీలో అధికారులతో పాటు విద్యార్థులు సైతం భాగస్వాములవుతారని తెలిపారు. చట్టాలను ఉల్లంఘిస్తూ బేస్‌మెంట్లను కోచింగ్ సెంటర్లుగా ఉపయోగిస్తున్న వారిపై ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ కఠినంగా వ్యవహరిస్తోందన్నారు. రాజేంద్రనగర్, ముఖర్జీనగర్, లక్ష్మీనగర్, ప్రీతి విహార్‌లోని 30 కోచింగ్ సెంటర్ల బేస్‌మెంట్‌లను సీజ్ చేశామన్నారు. మరో 200 కోచింగ్ సెంటర్లకు నోటీసులు జారీ చేసినట్లు ఆమె వెల్లడించారు. రాజేంద్రనగర్ ఘటనలో అధికారులు దోషులుగా తేలితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కాగా, కోచింగ్ సెంటర్ వద్ద సివిల్స్ విద్యార్థులంతా నిరవధిక దీక్షలు ప్రారంభించారు. బాధిత కుటుంబాలకు రూ.ఐదు కోట్లు చొప్పున పరిహారంతో పాటు తమ డిమాండ్లు నెరవేర్చాలని ఆందోళన చేశారు. ఇటీవల కోచింగ్ సెంటర్ నిర్లక్ష్యం కారణంగా బేస్‌మెంట్‌లోకి వరద నీరు రావడంతో ముగ్గురు సివిల్స్ విద్యార్థులు మృతిచెందిన ఘటనపై ఇప్పటివరకు దీనికి కారకులైన ఏడుగురిని పోలీసులు అరెస్టు చేశారు.

సహాయ శిబిరాల్లో విద్యార్థుల సేవలు ప్రశంసనీయం

వయనాడ్ : భారీ కొండచరియలు విరిగిపడిన ఘటనలో సర్వం కోల్పోయి కట్టుబట్టలతో మిగిలినవారి కోసం ఏర్పాటు చేసిన సహాయ శిబిరాల్లో మెప్పాడిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు అవిశ్రాంతంగా స్వచ్ఛందంగా పనిచేస్తున్నారు. పాఠశాల ఉపాధ్యాయులు కూడా కీలక పాత్ర పోషిస్తున్నారు. విద్యార్థులను ప్రోత్సహిస్తున్నారు. వీరిలో చాలా మంది ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ వలంటీర్లుగా ఉన్నవారే. విపత్తు నుంచి ప్రాణాలతో బయటపడినవారికి భౌతిక సహాయాన్ని అందించడమే కాకుండా వారిలో మనోధైర్యం కల్పించేందుకు మానసికంగానూ సహాయపడుతున్నారు. 'ఇక్కడ నివసించే వ్యక్తులు, వారి కుటుంబాలు మా స్నేహితులు. ఈ సంఘటనతో మేము చాలా బాధపడ్డాము. కానీ నేను సహాయం చేస్తున్నందుకు సంతోషంగా ఉన్నాను' అని విద్యార్థి వలంటీర్ అయిన ఆల్డ్రియా పీటీఐ కి చెప్పారు. మరో విద్యార్థి అనంతమేఘ మాట్లాడుతూ 'ఎన్‌సీసీ వలంటీర్లుగా మేము ఇక్కడ చేతులు కలిపి పనిచేయడానికి కట్టుబడి ఉన్నాం. కేవలం ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీలో ఉన్నవారే కాదు. మా పాఠశాలలోని ఇతర విద్యార్థులు కూడా స్వచ్ఛందంగా పనిచేస్తున్నారు' అని తెలిపింది. జీహెచ్ఎస్ఎస్ విద్యార్థి మెల్బిన్ మాట్లాడుతూ... బాధితుల కోసం సేకరించిన దుస్తులను క్రమబద్ధీకరించి వారికి సహాయం చేస్తున్నట్లు తెలిపాడు. జీహెచ్ఎస్ఎస్ మెప్పాడి ఉపాధ్యాయురాలు మినీ మాట్లాడుతూ... ప్రజల కోసం తాము చేయగలిగినదంతా చేస్తున్నామని, వయనాడ్ కోసం ప్రార్థిస్తున్నామని చెప్పారు. 'ఇది ఒక విషాదం. మేమంతా విచారిస్తున్నాం. ఇక్కడ అందరికీ అనుమతి లేదు. ఇక్కడ ఆంక్షలు ఉన్నాయి. ఇది చాలా ఎమోషనల్ డ్రామా. మేము వారిని ఓదార్చాము. ప్రేమ, ఆప్యాయతల నందిస్తున్నాం. వారికి పునరావాసం కల్పించాలనడం చాలా కష్టం. ఇది అధిగమించాలి.' అని చెప్పారు. 'మేము చేస్తున్నది చాలా తక్కువే కానీ చేయగలిగినది చేస్తున్నాం. విద్యార్థులు బట్టలు విభజిస్తూ వారికి సహాయం చేస్తున్నారు. మేము కొంతమంది విద్యార్థులను కోల్పోయాము. వారు ఎక్కడ ఉన్నారో మాకు తెలియదు. ఉన్నత పాఠశాలలో ఆరు గదులుండగా... దాదాపు వెయ్యి మంది ప్రజలు ఇక్కడ ఉన్నారు. తమతోపాటు ప్రపంచంలోని ప్రతి ఒక్కరూ కేరళ, వయనాడ్ కోసం ప్రార్థిస్తున్నారు' అని తెలిపారు.

ఉగ్ర దాడులు ఆందోళనకరం : ఫరూక్ అబ్దుల్లా

శ్రీనగర్ : జమ్మూకశ్మీర్‌లో ఉగ్ర దాడులు పెరుగుతుండటం, చొరబాటుదారులను వేటాడేందుకు వారాల తరబడి జరుగుతున్న సైనిక ఆపరేషన్లు ఎటువంటి ఫలితాలను ఇవ్వకపోవడంపై నేషనల్ కాన్ఫరెన్స్ అధ్యక్షుడు ఫరూక్ అబ్దుల్లా ఆందోళన వ్యక్తం చేశారు. పాకిస్తానీ కమాండోలు కేంద్రపాలిత ప్రాంతంలోకి చొరబడి హింస పెరగడానికి దోహదపడుతున్నారనే వాదనలకు కొంత ప్రామాణికత ఉండవచ్చని మాజీ ముఖ్యమంత్రి సూచించారు. రెండు దేశాల మధ్య శాంతి కోసం ప్రజలు ఆకాంక్షిస్తున్న సమయంలో దాడి జరగడం బాధాకరమని ఫరూక్ అన్నారు. 'శాంతికి బదులుగా దాడి జరిగే అవకాశం ఉంది. దానికి మనం భయపడుతున్నది. ఇది (ఉగ్ర దాడులు) కొనసాగితే, భారతదేశం దీనిని సహించని సమయం వస్తుంది. ఉగ్రవాదాన్ని అరికట్టేందుకు ప్రభుత్వం కొన్ని చర్యలు తీసుకోవాలని భారత ప్రజలు కోరుకుంటారు. 'ఉగ్రవాదం పెరుగుతోందని, అత్యున్నత శిక్షణ పొందిన వ్యక్తులు వస్తున్నారనడంలో సందేహం లేదు. ఈ విపత్తు నుంచి రక్షించాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నాం. వారికి (పాకిస్థాన్) బుద్ధి రావాలని మేము కోరుకుంటున్నాం. ఇది సమస్యలను పరిష్కరించదు. కానీ పరిస్థితిని మరింత దిగజార్చుతుంది' అని ఆయన అన్నారు. పాకిస్తానీ కమాండోల చొరబాటు గురించి అడగ్గా, ఫరూక్ ఇలా అన్నారు. 'అది వారు కమాండోలు కావచ్చు. వారు దాడి చేసే విధానం కావచ్చు. వారు బాగా శిక్షణ పొందినట్లు తెలుస్తోంది. అందుకే మేము పెద్ద ప్రమాదాన్ని చూస్తున్నాం' అని తెలిపారు.

మహిళలు, చిన్నారుల భద్రతకు ఖర్చు రూ.13,412 కోట్లు

న్యూఢిల్లీ: దేశంలో మహిళల భద్రత కోసం వివిధ పథకాలు, కార్యక్రమాల కింద కేంద్ర ప్రభుత్వం రూ.13,412 కోట్లు ఖర్చు చేస్తోందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ లోక్‌సభలో వెల్లడించారు. మహిళా భద్రతా పథకాల కింద మహిళలు, పిల్లలపై లైంగిక వేధింపుల కేసులు నిర్వహించే పరిశోధకులతోపాటు ప్రాసిక్యూటర్ల సామర్థ్యం పెంపొందించేందుకు శిక్షణ ఇచ్చే నిబంధన ఉందా?... ఏయే కార్యక్రమాలు అమలు చేస్తున్నారంటూ ఎంపీ నీరజ్ శేఖర్ అడిగిన ప్రశ్నకు బండి సంజయ్ బదులిచ్చారు. ప్రధాని మోదీ ఆదేశాల మేరకు హోంమంత్రి అధ్వర్యంలో మహిళలు, చిన్నారుల రక్షణకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. దానికి సంబంధించిన వివరాలను కేంద్ర మంత్రి సభలో వెల్లడించారు. ఇంటర్ ఆపరేబుల్ క్రిమినల్ జస్టిస్ సిస్టమ్ కోసం రూ.3,375 కోట్లు, ఎమర్జెన్సీ రెస్పాన్స్ సపోర్ట్ సిస్టమ్ కోసం రూ.531.24కోట్లు, స్కీం ఫర్ మోడర్నైజేషన్ ఆఫ్ ఫోరెన్సిక్‌కు రూ.280 కోట్లు, జైళ్ల ఆధునీకరణకు రూ.950 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రాల సైన్స్ ఫోరెన్సిక్ లేబరేటరీల పటిష్టత కోసం రూ.106.75 కోట్లు, సెంట్రల్ ఫోరెన్సిక్ సైన్స్ లేబొరేటరీలు, ఫోరెన్సిక్ డేటా సెంటర్, 6 సెంట్రల్ ఫోరెన్సిక్ సైన్స్ లేబొరేటరీల ఆధునికీకరణకు మరో రూ.354.25 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. అలాగే సేఫ్ సిటీ ప్రాజెక్టు కోసం రూ.2,840 కోట్లు, మహిళలకు శిక్షణ, సామర్థ్యం పెంపు కోసం రూ.76.5 కోట్లు, పేద ఖైదీల కోసం రూ.60 కోట్లు, మానవ అక్రమ రవాణా నిరోధక(యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్) యూనిట్ కోసం రూ.113.76 కోట్లు, మహిళా హెల్ప్ డెస్కులకు రూ.164.2 కోట్లు, చండీగడ్‌లో డీఎన్ఏ ల్యాబ్ ఏర్పాటుకు రూ.42.84 కోట్లు, మహిళలు, చిన్నారులపై సైబర్ నేరాల నియంత్రణకు రూ.224.76 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు బండి సంజయ్ వివరించారు.

ఉచితాల వల్లే మౌలిక వసతులు కరువు

కోచింగ్ సెంటర్ ప్రమాదంపై ఢిల్లీ హైకోర్టు

న్యూఢిల్లీ: ఢిల్లీ ఓల్డ్ రాజేంద్రనగర్‌లోని ఐఏఎస్ కోచింగ్ సెంటర్ సెల్లార్‌లోకి వరద నీరు ముంచెత్తి ముగ్గురు విద్యార్థులు మృతి చెందిన ఘటనపై బాధ్యులను ఢిల్లీ హైకోర్టు బుధవారం చీవాట్లు పెట్టింది. ఢిల్లీ ప్రభుత్వ 'ఉచితాల సంస్కృతి'ని వ్యతిరేకించింది. డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్, దర్యాప్తు అధికారిని శుక్రవారం తమ ముందు హాజరుకావాలని హైకోర్టు ఆదేశించింది. రాజేంద్రనగర్ ప్రాంతంలోని డ్రైన్లపైనున్న అన్ని ఆక్రమణలను శుక్రవారంలోగా తొలగించాలని కోర్టు ఆదేశాలిచ్చింది. రాజేంద్రనగర్ ఘటనపై ఉన్నతస్థాయి దర్యాప్తు కమిటీ ఏర్పాటు చేయాలని కోరుతూ న్యాయవాది రుద్ర విక్రమ్ సింగ్ దాఖలు చేసిన ప్రజాప్రయోజనాల వ్యాజ్యంపై విచారణ చేపట్టిన హైకోర్టు తాజా ఆదేశాలిచ్చింది. శుక్రవారం మధ్యాహ్నం 2.30 గంటలకు విచారణను వాయిదా వేసింది. ఉచితాల సంస్కృతి కారణంగా మౌలిక వసతుల మెరుగుదలకు, ముఖ్యంగా డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచేందుకు ప్రభుత్వం వద్ద నిధులు లేకుండా పోతున్నాయని, నగర జనాభా మరోవైపు ఇబ్బడిముబ్బడిగా పెరుగుతోందని తాత్కాలిక చీఫ్ జస్టిస్ మన్మోహన్, జస్టిస్ తుషార్ రావుతో కూడిన ధర్మాసనం అభిప్రాయపడింది. విచారణలో బాధ్యులను గుర్తించాల్సిన అవసరం ఉందని పేర్కొంది. 'బాధ్యులను తేల్చకుంటే దర్యాప్తును కేంద్ర సంస్థకు మేమే అప్పగించాల్సి వస్తుంది. ఇది చాలా తీవ్రమైన ఘటన. ఇది నిర్లక్ష్యానికి సంబంధించిన కేసు' అని ధర్మాసనం విస్పష్టంగా పేర్కొంది. కేసుకు సంబంధించిన అన్ని ఫైళ్లతో డీసీపీ, ఎంసీడీ కమిషనర్ శుక్రవారం 2.30 గంటలకు కోర్టు ముందు హాజరుకావాలని ఆదేశించింది. ఢిల్లీ ప్రభుత్వం, ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్, సంబంధిత అధికారుల నిర్లక్ష్యం వల్లే ఈ ఘటన జరిగిందని కోర్టు విమర్శించింది. వందల ఏళ్ల నాటి మౌలిక సదుపాయాలు ఎందుకు మెరుగుపరచడం లేదని నిలదీసింది. ఆ పని చేసి ఉంటే సెల్లార్‌లోకి నీళ్లు ఎలా వెళ్లేవని ప్రశ్నించింది. అధికారుల దివాలాకోరుతనం, బాధ్యతారాహిత్యం స్పష్టంగా కనిపిస్తోందని పేర్కొంది.

పేదల సొమ్ము దోచుకుంటున్న బ్యాంకులు

కాంగ్రెస్ నేత ప్రియాంక గాంధీ

న్యూఢిల్లీ : సగటు నెలవారీ బ్యాలెన్స్‌ను నిర్వహించని ఖాతాదారుల నుంచి ప్రభుత్వ రంగ బ్యాంకులు కోట్లాది రూపాయల అపరాధ రుసుము వసూలు చేస్తున్నాయని కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంక గాంధీ వాద్రా బుధవారం విమర్శించారు. పేద, మధ్యతరగతి ప్రజల జేబులు ఖాళీ చేసేందుకు మోదీ ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని ఆమె ఆరోపించారు. 2019-20 ఆర్థిక సంవత్సరం నుంచి ఐదేళ్లలో ప్రభుత్వ రంగ బ్యాంకులు సుమారు రూ.8,500 కోట్ల అపరాధ రుసుము వసూలు చేశాయన్న లోక్‌సభలో రాతపూర్వక సమాధానం నేపథ్యంలో ఆమె విమర్శలు గుప్పించారు. 2024 ఆర్థిక సంవత్సరంలో సగటు నెలవారీ కనీస నిల్వను నిర్వహించనందుకు ప్రభుత్వ రంగ బ్యాంకులు డిపాజిటర్లకు రూ.2,331 కోట్ల అపరాధ రుసుము విధించినట్లు కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి సోమవారం లోక్‌సభకు తెలియజేశారు. ఒక హిందీలో పోస్ట్‌లో, తగినంత డబ్బు లేనందుకు ఎవరైనా అపరాధ రుసుము విధించడం సున్నితమైన విషయం కాదని పేర్కొంటూ, ఈ సమస్య ప్రధానంగా తక్కువ లేదా పరిమిత ఆదాయం ఉన్న వారి కుటుంబాలను పోషించుకోవడానికి కష్టపడుతున్న వారిని ప్రభావితం చేస్తుందన్నారు. మాజీ ప్రధాని ఇందిరా గాంధీ పేదలకు సహాయం చేయడానికి బ్యాంకులను జాతీయం చేశారని పేర్కొంటూ, మోదీ విధానాలను ఆమె విభేదించారు. బీజేపీ ప్రభుత్వం పేద, మధ్యతరగతి ప్రజలను ఆర్థికంగా ఒత్తిడికి గురిచేస్తూనే పారిశ్రామికవేత్తలకు 16 లక్షల కోట్ల రూపాయలను మాఫీ చేసిందని ప్రియాంక పేర్కొన్నారు.

వయనాడ్ బాధితులకు విరివిగా విరాళాలు

తిరువనంతపురం: వయనాడ్‌లో కొండచరియలు విరిగిపడిన ఘటనలో దాదాపు 240 మందికి పైగా మృతిచెందిన ఘటన యావత్ దేశాన్ని కలిచి వేస్తోంది. దీంతో బాధిత కుటుంబాలను ఆదుకునేందుకు ప్రభుత్వంతో పాటు దేశవ్యాప్తంగా ప్రముఖులు ముందుకు వస్తున్నారు. వయనాడ్ విషాదంపై అదానీ గ్రూప్ తీవ్ర విచారం వ్యక్తం చేసింది. ప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబసభ్యులకు ప్రముఖ పారిశ్రామిక వేత్త గౌతమ్ అదానీ ప్రగాఢ సానుభూతి ప్రకటించారు.

ఇలాంటి సమయంలో కేరళ ప్రజలకు అదానీ గ్రూప్ అండగా నిలబడుతుందని అన్నారు. బాధిత కుటుంబాలను ఆదుకునేందుకు రూ.5 కోట్ల విరాళం ప్రకటించారు. అదానీ గ్రూప్‌తో పాటు ఆర్పీ గ్రూప్ రవి పిళ్లై, లూలు గ్రూప్ ఇంటర్నేషనల్ చైర్మన్ ఎంఏ యూసఫ్ అలీ, కల్యాణ్ జువెలర్స్ చైర్మన్ ఎండీ టీఎస్ కల్యాణరామన్ కూడా రూ.5 కోట్ల చొప్పున విరాళాన్ని సీఎం సహాయనిధికి అందిస్తున్నట్లు ప్రకటించారు. వయనాడ్ ఘటనపై నటుడు విక్రమ్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాదంలో మృతి చెందిన కుటుంబాలను ఆదుకునేందుకు సీఎం రిలీఫ్ ఫండ్‌కు రూ.20 లక్షలు విరాళంగా ఇస్తున్నట్లు ప్రకటించారు. మరోవైపు మలయాళ చిత్ర పరిశ్రమ వయనాడ్ ఘటనపై విచారం వ్యక్తం చేసింది. కొన్ని రోజుల పాటు సినిమా ఫంక్షన్లు, కార్యక్రమాలు నిలిపివేస్తున్నట్లు కొన్ని చిత్ర బృందాలు ప్రకటించాయి.

ఎల్ఐసీ ప్రీమియంపై జీఎస్టీ వద్దు

నిర్మలా సీతారామన్‌కు గడ్కరీ విజ్ఞప్తి

న్యూఢిల్లీ: కేంద్ర బడ్జెట్ 2024పై అనేక వర్గాల నుంచి విమర్శలు వెల్లువెత్తాయి. ఇది సామాన్యుల బడ్జెట్ కాదని, కేవలం రెండు రాష్ట్రాలకు సంబంధించిన బడ్జెట్ అంటూ రకరకాల విమర్శలు వచ్చాయి. తాజాగా దీనిపై ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ లేఖ రాశారు. జీవిత, వైద్య బీమా పథకాల ప్రీమియంలపై విధించిన జీఎస్‌టీని ఉపసంహరించుకోవాలని అభ్యర్థించారు. నాగపూర్ డివిజనల్ లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయీస్ యూనియన్ నుంచి వచ్చిన వినతిపత్రం ప్రకారం ఆర్థిక మంత్రికి లేఖ రాస్తున్నట్లు గడ్కరీ తెలిపారు. లైఫ్ అండ్ మెడికల్ ఇన్సూరెన్స్ ప్రీమియంపై జీఎస్‌టీ ఉపసంహరణకు సంబంధించిన వ్యవహారంపై యూనియన్ ప్రధానంగా ప్రస్తావించిందని ఆయన పేర్కొన్నారు. ఆ రెండింటిపై పన్ను విధింపు అనేది సరికాదన్నారు. కుటుంబానికి కొంత రక్షణ కల్పించడానికి, ప్రమాదాల సమయంలో వ్యక్తికి సహాయంగా నిలిచే ప్రీమియంపై పన్నును యూనియన్ వ్యతిరేకిస్తోందన్నారు. వైద్య బీమా ప్రీమియంపై 18 శాతం జీఎస్టీ అనేది సమంజసం కాదన్నారు. ఇదొక సామాజిక అవసరమని, అందువల్ల జీవిత, వైద్య బీమా పథకాల ప్రీమియంలపై జీఎస్టీని ఉపసంహరించుకోవాలని కోరారు. జీవిత బీమా ద్వారా పొదుపునకు అవకలన చికిత్స, ఆరోగ్య బీమా ప్రీమియం కోసం ఐటీ మినహాయింపులను తిరిగి ప్రవేశపెట్టడం, పబ్లిక్ సెక్టార్ జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీల ఏకీకరణకు సంబంధించిన అంశాలను కూడా యూనియన్ లేవనెత్తిందని గడ్కరీ చెప్పారు. ఈ విషయాలను దృష్టిలో పెట్టుకుని ప్రీమియంలపై జీఎస్టీ అనేది ముఖ్యంగా సీనియర్ సిటిజన్లకు ఇబ్బందికరంగా పరిణమించిందని వివరించారు. వాస్తవానికి జీవిత, ఆరోగ్య బీమా పాలసీలు ఇప్పుడు తప్పనిసరి అవసరంగా మారిపోయాయన్నారు.

అలా సమస్యలు తీరవు

దృష్టి ఐఏఎస్ యజమాని

న్యూఢిల్లీ: సెంట్రల్ ఢిల్లీలోని రావూస్ ఐఏఎస్ స్టడీ సెంటర్‌లోకి వరద పోటెత్తి ముగ్గురు విద్యార్థులు మృతి చెందిన ఘటనపై 'దృష్టి ఐఏఎస్' సంస్థ యాజమాన్యం స్పందించింది. 'ముగ్గురు విద్యార్థుల అకాల మరణంపై ప్రగాఢ సంతాపం తెలిజేస్తున్నాం. ఈ ఘటనతో విద్యార్థుల్లో పెల్లుబికిన ఆగ్రహం సరైందే. వారి ఆవేశం సరైన దిశలో ఉంటేనే మేలు జరుగుతుంది. కోచింగ్ సెంటర్ల కోసం సరికొత్త మార్గదర్శకాల రూపకల్పన విషయంలో మేం సహకరిస్తాం' అని తెలిపింది. అలాగే కోచింగ్ సంస్థల సమస్యలు పైకి కనిపించినంత సులభంగా ఉండవని యజమాని వికాస్ దివ్యకీర్తి అన్నారు. డీడీఏ (ఢిల్లీ డెవలప్‌మెంట్ అథారిటీ), ఎంసీడీ (మున్సిపల్ కార్పొరేషన్ ఆఫ్ ఢిల్లీ), అగ్నిమాపక విభాగం నియంత్రణల విషయంలో పలు అసమానతలు ఉన్నాయని వ్యాఖ్యానించారు. ఢిల్లీ మాస్టర్ ప్లాన్-2021లో మినహా మరెక్కడా కోచింగ్ సంస్థలకు సంబంధించి ఎలాంటి నిబంధనలను ప్రస్తావించలేదని గుర్తుచేశారు. తాజాగా కేంద్ర హోం మంత్రిత్వ శాఖ అధ్వర్యంలో ఏర్పాటైన కమిటీ నివేదికలో అయినా తగిన పరిష్కారాలు లభిస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. 'ప్రభుత్వమే ఢిల్లీలో కొన్ని స్థలాలను ఎంపికచేసి, వాటిని కోచింగ్ సంస్థల కోసం కేటాయించాలి. తరగతి గదులు, లైబ్రరీలు, హాస్టళ్లకు రూపకల్పన చేస్తే... అప్పుడు అధిక అద్దె, భద్రతా సమస్యలు ఉండవు' అని సూచించారు. మీడియాతో మాట్లాడుతూ ఈ కేసులో తనను బలిపశువును చేస్తున్నారని ఆరోపించారు.

'ఒకరిని బలిపశువును చేయడం వల్ల తాము బయటపడిపోయామని యంత్రాంగం అనుకుంటుంది. ప్రజలేమో నిందితుడు దొరికాడని భావిస్తారు' అని వ్యాఖ్యలు చేశారు. దీనివల్ల ఎప్పటినుంచో వ్యవస్థలో ఉన్న సమస్యలు తీరవనే అభిప్రాయాన్ని ఆయన వ్యక్తంచేశారు. విద్యార్థుల మృతి విషయంలో ఆలస్యంగా స్పందించడంపై అడిగిన ప్రశ్నకు బదులిస్తూ... 'ఉద్వేగపూరిత అంశాలపై నేను అంతగా మాట్లాడను. ఆ విద్యార్థులకు బాధాకరమైన మరణం సంభవించింది. వారి మృతికి సంబంధించిన ఆలోచనలే నా మదిలోకి వస్తున్నాయి' అని తెలిపారు. రావూస్ కోచింగ్ సెంటర్ ఘటన తర్వాత ఎంసీడీ నుంచి నోటీసులు అందుకొన్న పలు సంస్థల్లో 'దృష్టి ఐఏఎస్' కూడా ఉంది.

మాకూ నిధులు కావాలి

మోదీకి డీకే శివకుమార్ విజ్ఞప్తి

బెంగళూరు: కర్నాటకలోని సాగు నీటి ప్రాజెక్టులకు, బెంగళూరు అభివృద్ధికి మరిన్ని నిధులు ఇవ్వాలని ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ ప్రధాని మోదీని కోరారు. ఆయన బుధవారం ఢిల్లీలో ప్రధానిని కలిసి ఈ మేరకు విజ్ఞప్తి చేశారు. గుజరాత్ గిఫ్ట్ సిటీ తరహా బెంగళూరు అభివృద్ధికి సహకారాన్ని కర్నాటక ప్రభుత్వం కోరగా సానుకూల స్పందన రాకపోవడాన్ని ఆయన ప్రధాని దృష్టికి తీసుకెళ్లారు. టన్నెల్ ప్రాజెక్ట్, సిగ్నల్ రహిత కారిడార్, ప్రధాన రహదారులు, బెంగుళూరులో తుపాను నీటి కాలువల అభివృద్ధి, నీటిపారుదల ప్రాజెక్టుల కోసం మరిన్ని నిధులు కోరినట్లు తెలిపారు. ఖజానాకు అధిక పన్నులు అందజేసే రెండో మహానగరం బెంగళూరని డీకే శివకుమార్ చెప్పారు. కేంద్ర బడ్జెట్‌లో కేటాయింపులు లేకపోవడాన్ని ప్రశ్నించారు. మౌలిక వసతుల కల్పనకు నిధులు కోరారు. ఎగువ తుంగభద్ర ప్రాజెక్టుపై గత బడ్జెట్‌లో రూ.5,300 కోట్లు కేటాయించినప్పటికీ కేంద్రం నిధులు విడుదల చేయలేదని ప్రధానికి తెలిపారు. తమిళనాడుకు నిర్దేశిత నీటి కంటే అదనపు నీటిని జులైలో విడుదల చేయడంపై మోదీకి వివరించారు.

గవర్నర్‌గా గులాబ్ చంద్ బాధ్యతల స్వీకరణ

చండీగఢ్: పంజాబ్ గవర్నర్‌గా గులాబ్ చంద్ కటారియా బుధవారం ప్రమాణం స్వీకారం చేశారు. ఇక్కడి రాజ్‌భవన్‌లో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో కటారియా చేత హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం పంజాబ్ కొత్త గవర్నర్‌గా ఆయన బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా గవర్నర్ కటారియా మాట్లాడుతూ ఈ పదవి ద్వారా ప్రజలకు సేవ చేస్తానని చెప్పారు. పంజాబ్ గవర్నర్‌గా తనను నియమించినందుకు ముందుగా రాష్ట్రపతి ముర్ముకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. దాదాపు 45 ఏళ్ల పాటు ప్రజాజీవితంలో తాను ఉన్నానని ఆయన గుర్తు చేసుకున్నారు. ప్రజలకు ధర్మబద్ధంగా సేవ చేస్తానని హామీ ఇచ్చారు. సామాన్య ప్రజల సమస్యలు పరిష్కరించే దిశగా తాను అడుగులు వేస్తానన్నారు. ఎవరైనా వచ్చి తనతో మాట్లాడవచ్చని ప్రజలకు కొత్త గవర్నర్ సూచించారు. ప్రతి ఒక్కరితో స్నేహపూర్వకంగా మసులుకుంటానని ఆయన పేర్కొన్నారు. గవర్నర్ గులాబ్ చంద్ కటారియా స్వస్థలం రాజస్థాన్. గతంలో ఆ రాష్ట్ర అసెంబ్లీకి ఆయన 8 సార్లు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ఒకసారి రాష్ట్ర మంత్రిగా పని చేశారు. ఎంపీగా సైతం కటారియా గెలుపొందారు. ఇంతకు ముందు అసోం గవర్నర్‌గా గులాబ్ చంద్ కటారియా విధులు నిర్వహించారు. కొత్త గవర్నర్ కటారియాకు సీఎం మాన్ శుభాకాంక్షలు తెలిపారు.

స్వదేశీ పరిజ్ఞానంతో బుల్లెట్ రైళ్లు: కేంద్రం

న్యూఢిల్లీ: స్వదేశీ పరిజ్ఞానంతో బుల్లెట్ రైళ్ల రూపకల్పనకు భారత్ కసరత్తు చేస్తోందని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. అది క్లిష్టమైన, సాంకేతికపరంగా కఠినమైన ప్రాజెక్టు అని పేర్కొంది. అత్యున్నత స్థాయి భద్రత, నిర్వహణకు సంబంధించిన ప్రొటోకాల్‌ను పరిగణనలోకి తీసుకొని జపాన్ రైల్వే సహకారంతో ఈ ప్రాజెక్టు చేపట్టామని తెలిపింది. స్థానిక అవసరాలు, వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా మార్పులు చేశామని వెల్లడించింది. బుల్లెట్ రైలు ప్రాజెక్టుపై లోక్‌సభలో ప్రశ్నోత్తరాల సమయంలో మాట్లాడిన రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ ఈ వివరాలు వెల్లడించారు.

'ముంబై- అహ్మదాబాద్ మధ్య బుల్లెట్ రైలు పనులు వేగంగా సాగుతున్నాయి. సివిల్ నిర్మాణాలతోపాటు ట్రాక్, ఎలక్ట్రికల్, సిగ్నలింగ్, టెలీకమ్యూనికేషన్ పూర్తైన తర్వాత ఈ ప్రాజెక్టుపై ఓ అంచనాకు రావచ్చు. రెండు నగరాలను కలుపుతూ 508 కిమీ మేర ఈ ప్రాజెక్టు కొనసాగుతుండగా... 320 కి.మీ మార్గంలో పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. తొలుత మహారాష్ట్ర వైపు పనులు నెమ్మదించినప్పటికీ 2022లో బీజేపీ-శివసేన ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వేగం పుంజుకుంది' అని కేంద్ర మంత్రి పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టులో 21.కి.మీ మేర సముద్ర గర్భంలో సొరంగం పనులు కొనసాగుతున్నాయని రైల్వేమంత్రి పేర్కొన్నారు. తొలుత బుల్లెట్ రైలు సాంకేతికతను విదేశాల నుంచి తీసుకున్నప్పటికీ దేశీయంగా అభివృద్ధి చేసేందుకు కసరత్తు చేస్తున్నామన్నారు. మరోవైపు ప్రస్తుతం దేశవ్యాప్తంగా 102 వందేభారత్ సెమీ హైస్పీడ్ రైళ్లు రాకపోకలు సాగిస్తున్నట్లు వెల్లడించారు.

వయనాడ్ ప్రజలను ఆదుకోండి: సీపీఐ

న్యూఢిల్లీ: ప్రకృతి విలయానికి కేరళలోని వయనాడ్ జిల్లా అతలాకుతలమైంది. కొండ చరియలు విరిగి పడి 200 మందికిపైగా ప్రాణాలు కోల్పోయారు. దీంతో పీడిత ప్రజలకు తోచిన సాయం చేయాలంటూ భారత కమ్యూనిస్టు పార్టీ జాతీయ కార్యదర్శివర్గం బుధవారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేసింది. డబ్బు రూపేణ లేక ఇతరత్ర విధాలుగా వయనాడ్‌కు అండగా నిలవాలని సీపీఐ జాతీయ కార్యదర్శివర్గ సభ్యురాలు అనీరాజా, కార్యదర్శి వినయ్ విశ్వం కోరారు. సహాయక, పునరావాస కార్యకలాపాల్లో కేరళలోని పార్టీ శాఖలు, ప్రజా సంఘాలు క్రియాశీల పాత్ర పోషిస్తున్నట్లు ప్రకటన పేర్కొంది. అలాగే అన్ని రాష్ట్రాల్లోని పార్టీ శాఖల వారు కూడా తమ వంతు సహాయ, సహకారాలు అందజేయాలంటూ సీపీఐ పిలుపునిచ్చింది. సీపీఐ ఎంపీ పి.సంతోశ్ కుమార్, నాయకుడు పీపీ సునీర్ కూడా వయనాడ్‌లో పర్యటిస్తారని ప్రకటన వెల్లడించింది.

అంతా అసత్యం: విజయన్

వయనాడ్: వయనాడ్‌లో విపత్తు గురించి రాష్ట్రాన్ని ముందే హెచ్చరించామని కేంద్రమంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలపై కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ ఘాటుగా స్పందించారు. తమకు ఎలాంటి అలర్టు జారీ చేయలేదని అమిత్ షా వ్యాఖ్యలను ఖండించారు. 'విపత్తుకు ముందు కేంద్రం వయనాడ్‌కు రెడ్ అలర్ట్ ప్రకటించలేదు. అధికారులు హెచ్చరిక జారీ చేయడానికి ముందే కొండచరియలు విరిగిపడ్డాయి. ఒకరిపై ఒకరు నిందలు వేసుకునేందుకు ఇది సమయం కాదు. ప్రజలు కష్టాల్లో ఉన్నారు. సమస్యను పరిష్కరించడంపై దృష్టి పెట్టండి' అని సీఎం హితవు పలికారు. అమిత్‌షా ప్రకటన అసత్యాలతో కూడుకున్నదని విజయన్ మండిపడ్డారు. వయనాడ్‌లో కొండచరియలు విరిగిపడిన ప్రాంతాల్లో సహాయక చర్యలు కొనసాగుతున్నాయని విజయన్ తెలిపారు. ఇప్పటివరకు 144 మృతదేహాలు వెలికితీశారని, 191 మంది ఆచూకీ లభించలేదని తెలిపారు. 5,500 మందిని రక్షించినట్లు వెల్లడించారు. 8 వేల మందికి పైగా బాధితులను 82 శిబిరాలకు తరలించినట్లు పేర్కొన్నారు.

సాగు భారం

- కష్టాల్లో కౌలు రైతులు
- గత ప్రభుత్వ విధానాలతో నష్టం
- ఖరీఫ్ గుర్తింపు కార్డుల జారీలో జాప్యం
- అందని రబీ ధాన్యం సొమ్ము
- ఏలూరు, బాపట్ల, కోనసీమ జిల్లాల్లో పెండింగ్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఖరీఫ్ ప్రారంభమైనప్పటికీ కౌలు రైతుల కష్టాలు తీరలేదు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అన్నింటా నష్టపోయిన కౌలు రైతులు... ఈ కూటమి ప్రభుత్వ హామీల అమలు కోసం ఎదురు చూస్తున్నారు. కౌలు రైతులకు గుర్తింపు కార్డుల నుంచి రబీ కాలంలో విక్రయించిన ధాన్యం బకాయిలు, గుర్తింపు కార్డుల్లో భూ యజమానుల నుంచి అడ్డంకులు, ప్రతి ఏటా రైతు భరోసా, పంటల బీమా అందరికీ అందకపోవడం తదితర సమస్యలు పీడిస్తున్నాయి. ఖరీఫ్ నాటికి వారి సమస్యలు పరిష్కారానికి నోచుకోకపోవడంతో పంటల సాగు భారంగా మారింది. కూటమి ప్రభుత్వం తన మేనిఫెస్టోలో భాగంగా కౌలు రైతులకు గుర్తింపు కార్డులు అందజేసి అన్ని సంక్షేమ పథకాలను అందిస్తామని, పంటల బీమా వర్తింపజేస్తామని స్పష్టం చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 32 లక్షల మంది కౌలు రైతులు ఉన్నట్లు అంచనా. దీంతో వ్యవసాయ సాగులో కౌలు రైతులు కీలక భూమిక పోషిస్తున్నారు. కోస్తాంధ్రాలోని శ్రీకాకుళం నుంచి నెల్లూరు జిల్లా వరకు అత్యధికంగా కౌలు రైతులే భూములు సాగు చేస్తున్నారు. ఇటీవల ముగిసిన శాసన మండలి సమావేశాల్లో గత రబీలో రైతులు విక్రయించిన ధాన్యం బకాయిలపై సభ్యులు లేవనెత్తారు. ఇంకా రబీ బకాయిలే ఇవ్వకుంటే... ఖరీఫ్‌కు రైతాంగం ఎలా ముందుకు వెళుతుందని వారు ప్రశ్నించారు. రబీలో రాష్ట్ర వ్యాప్తంగా రూ.1,700 కోట్ల ధాన్యం బకాయిలు పేరుకుపోయాయి. ఇందులో ఏలూరు జిల్లా రూ.250 కోట్లు, కోనసీమ రూ.250 కోట్లు, పశ్చిమ గోదావరి జిల్లాకు రూ.850 కోట్లు, అలాగే కాకినాడ, బాపట్ల తదితర జిల్లాలకు రావాల్సి ఉంది. దాదాపు కొంతమేర విడుదలకు తాము యుద్ధప్రాతిపదికన చర్యలు చేపడతామని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ హామీ ఇచ్చినప్పటికీ... ఇంతవరకు దానిపై కదలిక లేదు. గత వైసీపీ ప్రభుత్వ హయాం నుంచి కూటమి ప్రభుత్వం ఏర్పడిన జులై 20వ తేదీ వరకు బ్యాంకులు, ఇతర వనరుల నుంచి ప్రభుత్వ హామీపై పౌర సరఫరాల శాఖ ద్వారా రూ.37,550 కోట్లు రుణాలు తీసుకొచ్చినట్లు మంత్రి నాదెండ్ల వెల్లడించారు. ఇందులో 14 జాతీయ బ్యాంకుల నుంచి రూ.32,300 కోట్లు ఉండగా, ఏపీ మార్క్‌ఫెడ్ నుంచి ఇంటర్ కార్పొరేట్ రుణం (ఎన్‌సీడీసీ ద్వారా) రూ.5 వేల కోట్లు, ఏపీ ఎస్‌ఎఫ్‌ఎస్‌సీఎల్ నుంచి హామీ లేని రుణం రూ.250 కోట్లు ఉన్నాయి. వాటిని వరి సేకరణతో పాటు ఎంఎస్‌సి కార్యకలాపాలు, పీడీఎస్ కార్యకలాపాల కింద బియ్యం, ఇతర వస్తువుల పంపిణీకి వినియోగిస్తున్నారు.

ఓసీలకు రైతు భరోసా ఏదీ?

కౌలు రైతుల్లో ఓసీలకు రైతు భరోసా అందలేదన్న అంశాన్ని శాసన మండలిలో సభ్యులు ప్రశ్నించారు. దీంతో మండలి చైర్మన్ కొయ్యే మోషెన్‌రాజు జోక్యం చేసుకుని అలాంటిదేమీ ఉండదని, అధికారులంతా సమగ్ర అధ్యయనం చేయాలని సూచించారు. దానిపై టీడీపీ సభ్యులు లేచి... కౌలు రైతులకు ఇచ్చే కొద్దిపాటి సాయాన్ని సైతం కులాలతో ముడిపెట్టడం తగదని, తక్షణమే గత వైసీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన ఉత్తర్వులను కూటమి ప్రభుత్వం రద్దు చేయాలని కోరారు. ప్రతి ఏటా ఏప్రిల్ మొదటి వారంలోనే విడుదల కావాల్సిన కౌలు రైతుల గుర్తింపు కార్డుల జారీపై ఇంతవరకు కదలిక లేదు. రబీలో వర్షాభావం వల్ల దెబ్బతిన్న పంటలకూ నష్టపరిహారం ఇవ్వలేదు. పైపెచ్చు నష్టపోయిన పంటల అంచనా కోసం కేంద్ర బృందాలు ఆలస్యంగా రావడంతోనూ రైతులకు తీవ్ర అన్యాయం జరిగింది. పంట రుణాలూ వారికి సక్రమంగా అందడం లేదు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ప్రతి ఏటా ఇచ్చే రైతు భరోసాకు రూ.100 కోట్లు కేటాయించినప్పటికీ, దానినీ సక్రమంగా అమలు చేయలేదన్న విమర్శలున్నాయి.

గత ప్రభుత్వ విధానాలు... కౌలు రైతులకు శాపం

గత వైసీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన పంటల సాగు చట్టం కౌలు రైతులకు శాపంగా మారింది. ఈ చట్టం ఆధారంగా కౌలు రైతులు తమ గుర్తింపు కార్డులు పొందాలంటే... ఆయా భూ యజమానుల అనుమతులను పొందాలన్న నిబంధన విధించింది. ప్రస్తుత పరిస్థితుల్లో తమ భూములను కౌలుకు ఇచ్చినట్లుగా భూ యజమానులు సంతకాలు చేయడం అనివార్యం. అలా ఎవ్వరూ ముందుకు రాని పరిస్థితి. దీంతో ఈ చట్టం ఆశయం పక్కదారి పట్టి అసలైన కౌలు రైతులకు నష్టం చేకూరింది. ఈ చట్టాన్ని ఆసరాగా తీసుకుని సాగు చేస్తున్న కొందరు భూ యజమానులే... తమ పొలాలను కొందరికి కౌలుకు ఇచ్చినట్లుగా సృష్టించి, నకిలీ కౌలు రైతుల గుర్తింపు కార్డులు పొందారు. తద్వారా ప్రభుత్వం ఇచ్చే సాయం భూ యజమానులకే చేరడంతో వాస్తవ కౌలు రైతులకు అన్యాయం జరిగింది. దీనిని కూటమి ప్రభుత్వం గుర్తించి భూ యజమానుల ప్రమేయం లేకుండానే కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని కౌలు రైతుల సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. కూటమి ప్రభుత్వం తక్షణమే స్పందించి పెండింగ్‌లో ఉన్న రబీ ధాన్యం బకాయిల విడుదలకు, కౌలు రైతులు అందరికీ వేగవంతంగా గుర్తింపు కార్డులు జారీకి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

ఎంఎస్‌పీ చట్టంతోనే రైతుకు రుణ విముక్తి: రాహుల్

న్యూఢిల్లీ: దేశ రైతులను రుణమనే ఊబి నుంచి బయటకు తెచ్చేందుకు ఎంఎస్‌పీ చట్టాన్ని ఒక అస్త్రంగా ఇండియా ఐక్య సంఘటన అందజేయనున్నట్లు ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఉద్ఘాటించారు. తెలంగాణలో రెండవ విడత రుణమాఫీ సందర్భంగా ఆ రాష్ట్ర రైతులకు శుభాకాంక్షలు తెలిపారు. రూ.6,198 కోట్లకుపైగా రుణమాఫీ జరిగిందని, 6.4లక్షల మంది రైతు కుటుంబాలకు లబ్ధి చేకూరిందని రాహుల్ 'ఎక్స్'లో పేర్కొన్నారు. 'తెలంగాణ రైతు సోదరులు, సోదరీమణులందరికీ శుభాకాంక్షలు. మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం తెలంగాణ ప్రభుత్వం రెండవ విడత రైతు రుణమాఫీ చేసింది' అని ఆయన హిందీలో పోస్టు పెట్టారు. ప్రజల ప్రభుత్వం 6.4లక్షల మంది రైతు కుటుంబాల రూ.1.5లక్షల చొప్పున రుణాన్ని మాఫీ చేసిందని పేర్కొన్నారు. 'ఓ వైపు దేశ రైతులను రుణ ఊబిలోకి బీజేపీ నెట్టివేసింది. కనీస మద్దతు ధర కోసం చట్టబద్ధమైన హామీ అవసరాన్ని నిరాకరించింది. వారి డిమాండ్లు తిరస్కరిస్తోంది. మరోవైపు వ్యవసాయ కుటుంబాలకు కాంగ్రెస్ అన్ని విధాలా అండగా నిలుస్తోంది. రైతులకు రుణ ఉచ్చు నుంచి విముక్తి కల్పించేందుకు ఎంఎస్పీ చట్టమనే అస్త్రాన్ని 'ఇండియా' ఇవ్వనుంది' అని రాహుల్ అన్నారు.

8 గేట్లు ఎత్తి... నీటి విడుదల

విశాలాంధ్ర-బ్యూరో-కర్నూలు: శ్రీశైలం జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి నీటి ప్రవాహం తగ్గింది. మంగళవారం రాత్రి 9 గంటల నుంచి బుధవారం ఉదయం 11 గంటల వరకు పది గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేశారు. 12 గంటల నుంచి 8 గేట్లను 10 అడుగుల మేర ఎత్తి 2,23,768 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. మధ్యాహ్నం 3 గంటల సమయానికి ఎగువ జూరాల నుంచి 2,77,285 క్యూసెక్కులు, తుంగభద్ర ద్వారా స్వల్పంగా 16,256 క్యూసెక్కులు కలిపి 2,93,813 క్యూసెక్కుల నీరు చేరుతాయి. జలాశయ నీటిమట్టం గరిష్ట స్థాయికి చేరుకొని 884.50 అడుగులకు చేరింది. నీటి నిల్వ సామర్థ్యం 212.9198 టీఎంసీలుగా ఉంది. కుడిగట్టు జల విద్యుత్తు కేంద్రంలో గడచిన 24 గంటలలో 24,917 క్యూసెక్కుల నీటితో 14.586 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తిని, ఎడమ గట్టు భూగర్భ జల విద్యుత్తు కేంద్రంలో 35,315 క్యూసెక్కుల నీటితో 17.667 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి చేస్తూ దిగువ సాగరకు 60,232 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం బ్యాక్ వాటర్ నుంచి పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్‌కు 24,083 క్యూసెక్కులు మహాత్మా గాంధీ కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్ 1600 క్యూసెక్కులు... దిగువ సాగర్‌కు 2,84,000 క్యూసెక్కులు కలిపి 3,09,683 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

బీజేడీ ఎంపీ మమత మహంతా రాజీనామా

న్యూఢిల్లీ: బిజూ జనతాదళ్ (బీజేడీ)కి ఎదురుదెబ్బ తగిలింది. పార్టీ నేత మమత మోహంతా తన రాజ్యసభ సభ్యత్వానికి బుధవారం రాజీనామా చేశారు. రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్కర్ కూడా ఆమె రాజీనామాను ఆమోదించారు. ఒడిశా నుంచి బీజేడీకి ప్రాతినిధ్యం వహిస్తున్న మమత మోహంతా తనకు రాజీనామా పత్రాన్ని అందించినట్లు ధన్కర్ తెలిపారు. అంతా సక్రమంగా ఉండటంతో దానిని ఆమోదించినట్లు వెల్లడించారు. కాగా, మమత మోహంతా బీజేపీలో చేరే అవకాశాలున్నాయని ఆ పార్టీ వర్గాలు తెలిపాయి. ఒడిశా అసెంబ్లీలో బీజేపీకి మెజారిటీ ఉన్నందున ఆమె రాజీనామాతో ఉప ఎన్నిక ఎప్పుడు జరిగినా బీజేపీ అభ్యర్థి గా తిరిగి గెలిచే అవకాశాలు ఉన్నట్లు పేర్కొన్నాయి.

కేజ్రీవాల్, కవిత, సిసోడియా కస్టడీ పొడిగింపు

న్యూఢిల్లీ: మద్యం కేసులో ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్, బీఆర్ఎస్ నేత కల్వకుంట కవిత ఆగస్టు 13 వరకు జ్యుడిషియల్ కస్టడీలో ఉండనున్నారు. ఈ మేరకు కస్టడీని పొడిగిస్తూ ప్రత్యేక న్యాయమూర్తి కావేరి బవేజా ఆదేశాలిచ్చారు. ఢిల్లీ మాజీ ఉప ముఖ్యమంత్రి మనీశ్ సిసోడియా కస్టడీని కూడా పొడిగించారు. సంబంధిత సీబీఐ దర్యాప్తులోని అవినీతి కేసులో సిసోడియా, కవితకు ఆగస్టు 9 వరకు కస్టడీ పొడిగిస్తూ ఉత్తర్వులు జారీచేశారు. జ్యుడిషియల్ కస్టడీ ముగియడంతో నిందితులను బుధవారంలో కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి తాజా ఆదేశాలిచ్చారు. మనీలాండరింగ్ కేసులో కేజ్రీవాల్‌కు జులై 31 వరకు, అవినీతి కేసులో ఆగస్టు 8 వరకు కస్టడీని పొడిగిస్తూ ఇంతకుముందు ఆదేశాలివ్వడం తెలిసిందే. కాగా, ఈడీ కేసులో కేజ్రీవాల్‌కు సుప్రీంకోర్టు బెయిల్ మంజూరైంది. అయితే బెయిల్ బాండ్‌ను సమర్పించలేని కారణంగా ఆయన తీహార్ జైల్లోనే ఉన్నారు.

కేరళకు ముందే చెప్పాం: అమిత్ షా

న్యూఢిల్లీ: కేరళ విలయంపై రాష్ట్ర ప్రభుత్వాన్ని ముందుగానే హెచ్చరించామని కేంద్ర హోంమంత్రి అమిత్ షా చెప్పారు. రాజ్యసభలో బుధవారం ఆయన మాట్లాడుతూ జులై 23నే వయనాడ్ ప్రకృతి వైపరీత్యంపై సీఎం పినరయి విజయన్‌ను కేంద్ర బలగాలు హెచ్చరించాయని వెల్లడించారు. కేరళ ప్రభుత్వం ముందస్తు హెచ్చరికలను పట్టించుకోలేదని, జాతీయ విపత్తు ప్రతిస్పందన దళం బెటాలియన్‌ల రాకతో కూడా అప్రమత్తం కాలేదని విమర్శించారు. ఈ విషాద ఘటన తరుణంలో మోదీ ప్రభుత్వం కేరళ సర్కార్‌తోపాటు రాష్ట్ర ప్రజలకు అండగా నిలుస్తుందని హామీ ఇచ్చారు. రాష్ట్రానికి కేంద్రం నుంచి అన్ని రకాల సహాయ సహకారాలు అందజేస్తామని పేర్కొన్నారు. కొండచరియలు విరిగిపడే ఏడు రోజుల ముందే జులై 20న రాష్ట్రానికి ముందస్తు హెచ్చరికలు జారీ చేశా మని, జులై 24న మరో హెచ్చరిక పంపినట్లు షా తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యంతోనే భారీగా ప్రాణ నష్టం జరిగిందని ఆయన ఆరోపించారు. అప్పటికే 9 ఎన్డీఆర్ఎఫ్ బృందాలను కేరళకు పంపినట్లు వివరించారు. కేంద్రం ముందస్తు హెచ్చరికలతో ఒడిశా, గుజరాత్ సహా అనేక రాష్ట్రాలు అప్రమత్తమయ్యాయని, ఎన్డీఆర్ఎఫ్ బృందాలు ఘటనా స్థలానికి చేరుకున్న వెంటనే కేరళ ప్రభుత్వం అప్రమత్తమై చర్యలు తీసుకుంటే ప్రాణ నష్టం తగ్గేదని తెలిపారు. ఇప్పటివరకు 185 మృతదేహాలు వెలికితీసినట్టు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి నిత్యానంద్ రాయ్ చెప్పారు.

'రాజకీయ కుటుంబం' వ్యాఖ్యపై ఖడ్గే అభ్యంతరం

న్యూఢిల్లీ: తన రాజకీయ జీవితాన్ని ప్రస్తావిస్తూ బీజేపీ ఎంపీ ఘనశ్యామ్ తివారీ చేసిన పరివార్‌వాద్ (రాజకీయ కుటుంబం) ఆరోపణలను రికార్డుల నుంచి తొలగించాలని రాజ్యసభ చైర్మన్‌కు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖడ్గే విజ్ఞప్తి చేశారు. తనపై పరివార్‌వాద్ ఆరోపణలను బీజేపీ ఎంపీ చేయడంతో అభ్యంతరం వ్యక్తంచేశారు. ఒకింత భావోద్వేగానికి లోనయ్యారు. చైర్మన్ జగదీప్ ధన్కర్ స్పందిస్తూ కాంగ్రెస్ నేతను నొప్పించిన ఏ పదం కూడా రికార్డుల్లో ఉండబోదని భరోసా ఇచ్చారు. సభలో పేపర్ల లిస్టింగ్ తర్వాత ఈ అంశాన్ని ఖడ్గే ప్రస్తావించారు. ఖడ్గే కుటుంబమంతా రాజకీయాల్లో ఉన్నట్లు తివారీ విమర్శించారు. 'పరివార్‌వాద్' వ్యాఖ్య చేశారు. దీనిని రికార్డుల్లో నుంచి తొలగించాలని సభాపతిని ఖడ్గే కోరారు. తాను తొలితరం రాజకీయ నేతనని చెప్పుకొచ్చారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన తర్వాత రాజకీయ ప్రస్థానం మొదలైందని చెప్పారు. తన తండ్రి 85వ ఏటా చనిపోయారని ఖడ్గే తెలుపగా... మీరు అంతకంటే ఎక్కువ కాలం జీవించాలని ఆకాంక్షిస్తున్నా అని ధన్కర్ అన్నారు. దీనికి స్పందించిన ఖడ్గే... ఇలాంటి వాతావరణంలో ఎక్కువ కాలం జీవించాలని కోరుకోనన్నారు. తివారీ మాటల్లో తనకు ఏమీ తప్పుగా తోచలేదని ధన్కర్ చెప్పారు. కాంగ్రెస్ అధ్యక్షుడి వినతి మేరకు రికార్డులను క్షుణ్ణంగా పరిశీలిస్తానని హామీ ఇచ్చారు.

నిస్పృహతోనే సీతారామన్ విమర్శలు: కాంగ్రెస్

న్యూఢిల్లీ: తీవ్ర నిస్పృహతోనే ప్రతిపక్షంపై ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ విమర్శలు చేస్తున్నారని కాంగ్రెస్ దుయ్యబట్టింది. పెట్టుబడులకు మన దేశం సురక్షితం కాదనే సందేశాన్ని విదేశీ పెట్టుబడుదలకు వెళ్లేలా... భారత ప్రతిష్ఠను దిగజార్చేందుకు కుట్ర జరుగుతోందని సీతారామన్ విమర్శించారు. దీనిని కాంగ్రెస్ ఖండించింది. 'భారత్‌లో దేశీయ-విదేశీ ప్రైవేటు పెట్టుబడి...ఆర్థిక వృద్ధికి కీలకం కానీ అది నత్తనడకన సాగుతూ పురోగతికి ఒప్పుకోవడంలేదు. అవతార పురుషుడైన ప్రధాని, ఆయన అనుయాయులు భీకరంగా కార్పొరేట్ పన్నుల్లో కోతలు విధించినప్పటికీ ఇదంతా జరుగుతోంది' అని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ వ్యాఖ్యానించారు. ఈ ప్రహేళిక (పజిల్)కు తాను అనుకున్నదే సమాధానం అన్నట్లు ఆర్థిక మంత్రి తీరున్నదని దుయ్యబట్టారు. లోక్‌సభలో కాంగ్రెస్‌పై విమర్శలు గుప్పించడంతో ఆమె తనలోని నిస్పృహను బయటపెట్టుకున్నారని జైరాం రమేశ్ అన్నారు. బోర్డు రూమ్‌లలో జరిగే పెట్టుబడులపై కీలక నిర్ణయాలను అధికార పక్షం కాకుండా ప్రధాన ప్రతిపక్ష పార్టీ మాటలు శాసిస్తాయన్నట్లుగా ఆమె వ్యవహరి స్తున్నారన్నారు.

విశాలాంధ్ర ఎంప్లాయీస్ యూనియన్ వజ్రోత్సవ దృశ్యమాలిక

నాట్య మయూరాలు!

విజయవాడ విశాలాంధ్ర దినపత్రిక కార్యాలయంలో బుధవారం విశాలాంధ్ర ఎంప్లాయీస్ యూనియన్ వజ్రోత్సవం జరిగింది. హంసధ్వని కూచిపూడి నృత్యాలయం (విజయవాడ-సత్యనారాయణపురం) కళాకారులు నాట్యకళా ప్రదర్శనకు విచ్చేశారు.

ఈ సందర్భాన్ని పురస్కరించుకుని చిరంజీవులు నవ్య సువర్ణ, లాస్య, శ్వేత, మానస, రూపశ్రీలతో సీనియర్ జర్నలిస్ట్ మంజరి వివిధ కళారూపాలపై ముచ్చటించారు. తాము ఎలా స్ఫూర్తి పొందామో చిన్నారులు ఆమెకు వివరించారు. అనంతరం గురువు సీహెచ్. అజయ్‌కుమార్ ప్రత్యక్ష పర్యవేక్షణలో చిన్నారులు వేదికపై ప్రదర్శించిన వివిధ కళానృత్యాలు ఆహుతులను అలరించాయి. చప్పట్లతో వారిని అభినందనల్లో ముంచెత్తారు.

విశాలాంధ్ర-విజయవాడ

బీజేపీ, జేడీఎస్ మైత్రికి బీటలు

వారితో వేదిక పంచుకోం: కుమారస్వామి

న్యూఢిల్లీ: లోక్‌సభ ఎన్నికల్లో మహారాష్ట్ర నుంచి బీజేపీతో పొత్తు పెట్టుకుని పోటీ చేసిన జేడీఎస్ తాజాగా అడ్డం తిరిగింది. కర్నాటక బీజేపీ తలపెట్టిన పాదయాత్రకు తమ నుంచి ఎలాంటి మద్దతు ఉండదని జేడీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి హెచ్‌డీ కుమారస్వామి స్పష్టంచేశారు. పాదయాత్రలో పాల్గొనేందుకు హసన్ మాజీ ఎమ్మెల్యే ప్రీతం గౌడకు ఆహ్వానం పంపడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. సిద్ధరామయ్య ప్రభుత్వం అవకతవకలపై ఆగస్టు 3 నుంచి వారం రోజుల పాదయాత్ర చేపడుతున్నట్లు బీజేపీ ఇటీవల ప్రకటించింది. బీజేపీ పాదయాత్రకు జేడీఎస్ మద్దతు ఇచ్చేది లేదని, దేవెగౌడ కుటుంబాన్ని అప్రతిష్టపాలు చేసేందుకు ప్రయత్నించిన వ్యక్తితో వేదిక ఎలా పంచుకుంటానని బుధవారం మీడియా ముందు కుమారస్వామి విమర్శలు గుప్పించారు. 'వాళ్లు (బీజేపీ) మమ్మల్ని పరిగణనలోకి తీసుకోనప్పుడు వారికి మేము ఎందుకు మద్దతిస్తాం? పాదయాత్రలో మమ్మల్ని ఎలా చూసుకుంటారో వాళ్లు చెప్పాలి. వాళ్లు ఏం సాధించాలనుకుంటున్నారు? నేను గాయపడ్డాను. ప్రీతం జే గౌడ ఎవరు? హెచ్‌డీ దేవెగౌడ కుటుంబాన్ని దెబ్బతీయాలని ప్రయత్నించిన వారిలో అతను ఒకడు. వాళ్లు (బీజేపీ) ఆయనను వేదికపైకి తేవాలనుకుంటున్నారు. నాతో పాటు కూర్చోపెట్టాలనుకుంటున్నారు. పెన్‌డ్రైవ్ (ప్రజ్వల్ రేవణ్ణ కేసులో)ల పంపిణీ వెనుక బాధ్యులెవరు? హసన్‌లో ఏమి జరిగిందో బీజేపీకి తెలియదా? ఎన్నికల్లో పొత్తు వేరు, రాజకీయాలు వేరు' అని కుమారస్వామి తీవ్రస్వరంతో అన్నారు. దీనికి ముందు, జేడీఎస్ కోర్ కమిటీ జీటీ దేవెగౌడ అధ్యక్షతన బెంగళూరులో సమావేశమైంది. రాష్ట్రంలో వర్షాలు పడుతున్న కారణంగా పాదయాత్ర వాయిదా వేయాలని బీజేపీని కోర్‌కమిటీ కోరింది. తాజాగా బీజేపీ పాదయాత్రకు దూరంగా ఉండాలని కుమారస్వామి నిర్ణయించారు. వర్షాలు, కొండచరియలు, పంటల ధ్వంసంతో రాష్ట్రం వణుకుతోందని, ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో పాదయాత్ర చేస్తే ప్రజల నుంచి విమర్శలు ఎదురయ్యే అవకాశాలున్నాయని, ఆ కారణంగా తాము పాదయాత్రను ఉపసంహరించుకుంటున్నామని ఆయన చెప్పారు. బీజేపీ తలపెట్టిన పాదయాత్రకు నైతిక మద్దతు కూడా ఇవ్వడం లేదన్నారు. తమను నమ్మనప్పుడు మద్దతు ఎందుకు ఇవ్వాలని ప్రశ్నించారు. బెంగళూరు నుంచి మైసూరు వరకూ తమ పార్టీ చాలా బలంగా ఉందన్నారు. ప్రస్తుతానికైతే పాదయాత్రలో చేరేందుకు జేడీఎస్ కోర్ కమిటీ ఏమాత్రం సానుకూలంగా లేదని ఆయన తెగేసి చెప్పారు.

కేవీల్లో ఎంపీల కోటా పునరుద్ధరణ కుదరదు: కేంద్రం

న్యూఢిల్లీ: కేంద్రీయ విద్యాలయాల ప్రవేశాల్లో పార్లమెంటు సభ్యులకు గతంలో ఇచ్చిన కోటా పునరుద్ధరించే అంశాన్ని కేంద్ర ప్రభుత్వం మరోసారి తోసిపుచ్చింది. అటువంటి ప్రతిపాదన లేదని స్పష్టం చేసింది. రాజ్యసభలో శివసేన యూబీటీ ఎంపీ ప్రియాంక చతుర్వేది అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి జయంత్ చౌదరి లిఖితపూర్వక సమాధానమిచ్చారు. 'ఎంపీల కోటాతోసహా ప్రత్యేక విభాగాల్లో ప్రవేశాలు కల్పించేందుకు అవకాశం ఉండేది. దాంతో తరగతుల్లో విద్యార్థి-టీచర్ నిష్పత్తి భారీగా పెరిగిపోతుంది. ఇది బోధనపై ప్రతికూల ప్రభావం చూపిస్తుంది. ఈ క్రమంలో ఈ కోటాను పునరుద్ధరించే ప్రతిపాదనేదీ ప్రస్తుతానికి కేంద్రం వద్ద లేదు' అని వెల్లడించారు. ఎంపీల కోటాలో భాగంగా కేవీల్లో ఒక ఎంపీ గరిష్ఠంగా 10 మంది పిల్లలను సిఫార్సు చేయొచ్చు. లోక్‌సభ, రాజ్యసభ కలిపి 788 సభ్యులుండగా... వీరందరికీ ఏడాదిలో 7880 మంది విద్యార్థులను కేవీల్లో చేర్పించే విచక్షణాధికారం ఉండేది. అటు జిల్లా మేజిస్ట్రేట్‌లు కూడా 17 మందిని సిఫార్సు చేసే అధికారం ఉండేది. ఇలా కేంద్రీయ విద్యాలయాల్లో ప్రవేశాలకు విద్యార్థులను సిఫార్సు చేసే కోటాలను కేంద్రం 2022 ఏప్రిల్‌లో రద్దు చేసింది. తిరిగి వాటిని పునరుద్ధరించే యోచన లేదని స్పష్టం చేసింది.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2024-26, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.